
Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 20.02.2015, శుక్రవారం సంపుటి : 34 సంచిక : 38 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్


వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com

## అసంబద్ధ నిర్ణయాలతో ప్రజలకు శిక్ష...

# అధికారానికి మీడియా రక్ష!

- ప్రభుత్వం రవ్వంత చేసినా కొండంత ప్రచారం
- ప్రజావ్యతిరేక నిర్ణయాలను పట్టించుకోని ప్రచార సాధనాలు



ఆంధ్రప్రదేశ్‌లో దారుణాతి దారుణ పరిస్థితులు నెలకొన్నాయి. విభజన మూలంగా రాష్ట్ర ఆర్థిక స్థితి అస్తవ్యస్థంగా వుంది. ఉద్యోగులకు నెలొచ్చేసరికి జీతాలు ఇవ్వడానికి నిధులు వెదుక్కోవాల్సి వస్తుంది. విభజన సమయంలో కేంద్రం రాష్ట్రానికి ఇచ్చిన హామీలలో ఒక్కటీ నెరవేర్చడం లేదు. కేంద్రంతో పోరాడైనా ఈ హామీలను సాధించుకోవాలనే చిత్తశుద్ధి రాష్ట్ర ప్రభుత్వానికి లేదు. సరికదా చంద్రబాబు ఇంకా రెండుకళ్ల సిద్ధాంతాన్ని అనుసరిస్తున్నాడు. తెలంగాణలోనూ తన పార్టీని కాపాడుకోవాలనే కాంక్షతో తనకు అధికారం అప్పగించిన ఆంధ్రా ప్రజల తరపున పూర్తిస్థాయిలో వకాల్తాపుచ్చుకోలేకపోతున్నాడు. రాష్ట్రానికి న్యాయంగా రావాల్సిన వాటిని కూడా గట్టిగా అడగలేకపోతున్నారు.

ఇక పరిపాలన చూస్తే అసలు రాష్ట్రంలో ప్రభుత్వం ఒకటి ఉందా? అనే అనుమానం కలుగుతుంది. ఎన్నికల్లో ఓట్ల కోసం చంద్రబాబు ఇచ్చిన హామీలు అటకెక్కాయి. రైతు ఋణమాఫీ మొదలుకొని ఏ కార్యక్రమం కూడా సవ్యంగా అమలు కావడం లేదు. సింగపూర్ రాజధాని అంటూ నూటికి 99మంది ప్రజలకు ఏ మాత్రం అవసరం లేని రాజధాని అంశాన్ని చంద్రబాబు తలకెత్తుకున్నాడు. వేల ఎకరాల పచ్చటి పొలాలను నాశనం చేస్తున్నారు. భూములివ్వలేమంటున్న రైతుల నుండి సైతం సిఆర్‌డిఏ చట్టం తెచ్చి బలవంతంగా భూములు లాక్కుంటున్నారు. చంద్రబాబు సర్కార్‌కు సింగపూర్ లాంటి రాజధాని కట్టాలనే వ్యామోహం తప్ప ప్రజల వాస్తవ సమస్యలు తెలుసుకోవడం లేదు.

ఇలాంటి పరిస్థితులున్న రాష్ట్రానికి దివంగతనేత వై.యస్.రాజశేఖరరెడ్డో, జగన్మోహన్‌రెడ్డో , లేదంటే రోశయ్యో, కిరణ్‌కుమార్‌రెడ్డో ముఖ్యమంత్రిగా వుండుంటే రాష్ట్రంలోని మీడియా ఏం చేసుండేది. ప్రతిరోజూ నిలువునా ఏరియల్ సర్ఫ్‌తో ప్రభుత్వాన్ని ఉతికి ఆరేస్తుండేవి. కానీ, ఇప్పుడు తెలుగుదేశం ప్రభుత్వాన్ని మాత్రం రాష్ట్ర మీడియా ఆ విధంగా చేయడం లేదు. చంద్రబాబు రవ్వంత పనిచేసినా కొండంత ప్రచారం కల్పిస్తున్నాయి. కొండంత తప్పు చేస్తే గోరంత కూడా చూపకుండా కాపాడుతున్నాయి. రాష్ట్రంలో మెజార్టీ మీడియా సంస్థలన్నీ దాదాపు వన్‌సైడ్‌గా ఉంటున్నాయి.

ప్రధాన ప్రతిపక్షంగా అవతరించిన వై.యస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ అధినేత కేవలం పార్టీ (మిగతా 10వ పేజీలో)



## మహానిర్మాత.. మనకిక లేరు

### స్ఫూర్తిదాయకుడు రామానాయుడు

తన అద్వితీయమైన చిత్రాలతో అశేష ప్రజానీకాన్ని ఉర్రూతలూగించిన సినీ దిగ్గజం..డి.రామానాయుడు మనకిక లేరు. కొంత కాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఈ నెల 18న 'ఇక సెలవంటూ'.. వెళ్ళిపోయారు. (మిగతా 10వ పేజీలో)






## మళ్ళీ షాక్...

ఈమధ్య సోషల్ నెట్‌వర్క్‌లోనూ, మీడియాలోనూ ఓ సన్నివేశం హల్‌చల్ చేసింది. రాజధానికి ఎంపిక చేసిన తుళ్లూరు ప్రాంతంలో ఓ మహిళ తన ఆవేదనను వెళ్లబోసుకుంది. రాజధాని భూసేకరణలో ఆ మహిళకు సంబంధించిన భూమి పోతుంది. దీనిపైనే ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. పుట్టి బుద్దెరిగాక నేను తెలుగుదేశం పార్టీకి తప్ప ఇంకో పార్టీకి ఓటేయలేదు. కాని ఈరోజు ఈ పార్టీకి ఎందుకు ఓటేసామా అని బాధపడుతున్నాను. మా జీవనాధారంగా వున్న భూములు లాగేసుకుంటున్నారు. సిఆర్‌డిఏ చట్టాన్ని తెచ్చి మా మెడకు చుట్టారు. రాజధానికి చంద్రబాబు భూములుంటే ఇచ్చుకోమనండి, ఆ నారాయణ కాలేజీ బిల్డింగ్‌లలో రాజధాని పెట్టుకోమనండి... అంటూ ఆ మహిళ ఆవేశంగా మాట్లాడింది. ఆమె ఇంకా ఘాటుగా మాట్లాడింది. వాటిని పత్రికలలో వ్రాయడం సభ్యత కాదు.

ఇన్నేళ్లుగా తెలుగుదేశంకే ఓటేస్తున్న ఆమెకు చంద్రబాబు మీద ఇంత వైరాగ్యం ఎందుకేర్పడిందనేదానిపై ముఖ్యమంత్రి గాని, ఆయన మంత్రివర్గ సహచరులుగాని పరిశీలన చేయలేదు. అధికారం చేతిలో వుందికాబట్టి ఆమె మీద కూడా వేధింపులకు దిగారు. రాష్ట్ర పరిపాలకులు ఇక్కడ ఒక విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి. ధైర్యవంతురాలు కాబట్టి ఆ మహిళ తన ఆవేశాన్ని బహిరంగంగా వెళ్లగక్కింది. ఆ మహిళ మాదిరిగానే చంద్రబాబును చాలామంది బయటకు (మిగతా 10వ పేజీలో)

# కళలను కాపాడుకోవాలి

**- ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య**



ఆధునిక ప్రపంచంలో చోటుచేసుకుంటున్న పెనుమార్పులతో అంతరించిపోతున్న కళలను కాపాడుకోవాలని నెల్లూరుజిల్లా సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. సూళ్లూరుపేటకు చెందిన కళాకారుడు చంద్ర, అమ్మఆర్ట్స్ సంస్థ ద్వారా జిల్లా స్థాయి చిత్రకళా పోటీలను నిర్వహించారు. ఆదివారం విజేతలకు ఎమ్మెల్యే చేతులమీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సంజీవయ్య మాట్లాడుతూ కంప్యూటర్లు వచ్చినా, డిజిటల్ డిజైన్లు వచ్చినా చేతితో కుంచె పట్టుకుని చిత్రాలు గీసే కళకు ఈనాటికీ విలువలున్నాయంటే చంద్ర లాంటి చిత్రకళాకారులే కారణమన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన విద్యార్థులు తమలోని చిత్రకళా ప్రతిభను ప్రదర్శించారు. అద్భుతంగా వున్న వంద చిత్రాలను ఎంపిక చేసి వాటిని గీసిన వారిని బంగారు పతకాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపీ పట్టణ అధ్యక్షుడు కళత్తూరు శేఖర్‌రెడ్డి, కౌన్సిలర్ పాల మురళి తదితరులు పాల్గొన్నారు.

# చాక్లెట్ లారీ కేసు కొలిక్కి

నెల్లూరుజిల్లా తడలో ఇటీవల సంచలనం కలిగించిన చాక్లెట్, ఇనుపచువ్వల లారీల అపహరణ కేసు ఓ కొలిక్కివచ్చింది. గత ఏడాది నవంబర్ 24వతేదీన ఇండోర్ నుంచి చెన్నైకు చాక్లెట్ల లోడుతో వెళుతున్న లారీని 8మంది దుండగులు డ్రైవర్‌ని, క్లీనర్‌ను కొట్టి లారీలో ప్రయాణిస్తున్న లారీ ఓనర్, మహారాష్ట్రకు చెందిన దినేష్ చౌహాన్‌తో సహ లారీని అపహరించుకుని వెళ్ళారు. లారీ డ్రైవర్, క్లీనర్ తడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు రంగప్రవేశం చేసి కేసు దర్యాప్తు చేపట్టారు. ముమ్మరంగా విచారణ నిర్వహించిన పోలీసులు ఎట్టకేలకు ఆచూకీ కనుగొన్నారు. గుజరాత్ ప్రాంతానికి చెందిన వారి పనిగా గుర్తించి నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

ఇదిలా వుండగా చాక్లెట్ల లోడు లారీ అపహరణ జరిగిన కొద్ది గంటల వ్యవధిలో నవంబర్ 26వ తేదీ ఉదయం కోల్‌కత్తా నుంచి తమిళనాడులోని అంబత్తూరుకు ఇనుపచువ్వల లోడుతో వెళుతున్న మరో లారీని పన్నంగాడు కుప్పం వద్ద ఇదే తరహాలో దుండగులు తీసుకెళ్లారు. ఇనుపరాడ్ల లారీ చిత్తూరుజిల్లా మీదుగా తిరుపతి వైపు వెళుతుండగా గవర్నర్ బందోబస్తు ఏర్పాట్లలో వున్న పోలీసులు భారీ వాహనాలను పక్కనపెడుతుండగా దుండగులు లారీని వదిలి వెళ్లిపోవడంతో ఇనుపరాడ్లు లేకుండా లారీ మాత్రం పట్టుబడింది.

# అర్హులందరికీ న్యాయం చేయాలి

**- ఎమ్మెల్యే మేకపాటి గౌతంరెడ్డి**

ప్రభుత్వ పథకాలను ప్రజలకు వర్తింపజేయడంలో అధికారులు ఎలాంటి పక్షపాత ధోరణితో వుండకుండా, అర్హులైనవారందరికీ న్యాయం చేయాలని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి గౌతంరెడ్డి అన్నారు. అనుమసముద్రంపేట మండలంలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, వైఎస్సార్సీపి మండల కన్వీనర్ పందిళ్ళపల్లి సుబ్బారెడ్డి మాట్లాడుతూ అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, ఎన్నిసార్లు అర్జీలు ఇచ్చినా అర్హులకు న్యాయం చేయడం లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వైఎస్సార్సీపికి ఓట్లు వేశారనే కక్షతో అర్హులైన వారికి కూడా న్యాయం చేయడం లేదని ఆయన ఆరోపించారు. అందుకు స్పందించిన గౌతంరెడ్డి మాట్లాడుతూ అధికారులు పార్టీలకు అతీతంగా అర్హులైనవారందరికీ న్యాయం చేయాలన్నారు. ప్రజల సమస్యలు తీర్చేందుకు అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే గౌతంరెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో బలరామిరెడ్డి, ఖాజా రహంతుల్లా, ఖాదర్‌బాషా, మస్తాన్, మల్లు సుధాకరరెడ్డి, కె.హజరత్తమ్మ, రియాజ్ అహమ్మద్, కాటంరెడ్డి నారసింహారెడ్డి, పి.ఖాదర్, సర్పంచ్‌లు బ్రహ్మారెడ్డి, వెంకటరమేష్‌రెడ్డి, రాజ్యలక్ష్మి, సుజాత, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

# టిడిపి బలోపేతానికి కృషి చేయాలి

తెలుగుదేశంపార్టీ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని విజయ డెయిరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం నెల్లూరురూరల్ మండలంలోని దేవరపాళెంలో పార్టీ గ్రామకమిటీ ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో టిడిపి అధికారంలో ఉన్నప్పటికీ జిల్లాలో మాత్రం ఆశించిన స్థాయిలో ఎన్నికల్లో పార్టీ విజయం సాధించలేకపోయిందన్నారు. ఈ సమావేశంలో కిలారి వెంకటస్వామినాయుడు, పార్టీ మండల అధ్యక్షులు చిరమన శ్రీనివాసులురెడ్డి, వేమిరెడ్డి అశోక్‌రెడ్డి, రాంగోపాల్, మల్లినేని వెంకటేశ్వర్లు నాయుడు, సుధాకర్‌రెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు వేమిరెడ్డి కౌశల్యమ్మ, జడ్పీటీసీ సభ్యురాలు యాకసిరి రమ, ఎంపిటిసి సభ్యురాలు అనసూయమ్మ పాల్గొన్నారు.


# షటిల్ బ్యాడ్మింటన్‌లో గూడూరు విజయం

నాయుడుపేటలోని అగ్రహారపేటలో ఇటీవల మూడురోజుల పాటు జరిగిన రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ డబుల్స్ పోటీల్లో గూడూరు జట్టు విజయం సాధించింది. సోమవారం వేకువ వరకు జరిగిన ఈ ఫైనల్స్ పోటీలు ఎంతో ఉత్కంఠను కలిగించాయి. ముప్పాళ్ళ రిక్రియేషన్స్ క్లబ్ 10వ వార్షికోత్సవం సందర్భంగా ఈ పోటీలు నిర్వహించారు. పోటీల్లో పలు జిల్లాలకు చెందిన 120జట్లు దాకా పాల్గొన్నాయి. ఈర్షద్-హర్షద్, సాయి-సుధీర్ జట్లు ఫైనల్స్‌కు చేరుకుని పోటాపోటీగా ఆడాయి. ఈ పోరులో ఈర్షద్-హర్షద్ జట్టు విజేతగా నిలిచింది. ఈర్షద్-హర్షద్ జట్టుకు ముప్పాళ్ళ చంద్రశేఖరరెడ్డి సోదరులు రూ.10,116లు బహుమతిగా అందజేశారు. ద్వితీయస్థానంలో నిలిచిన గూడూరు జట్టుకు చెందిన సాయి-సుధీర్‌లకు ఎ. నాగేశ్వరరావు రూ.8,116లు బహుమతిగా అందజేశారు. తృతీయ స్థానం సాధించిన ఎమ్మార్పీ క్లబ్ జట్టు ఇర్ఫాన్-ముత్తుకు వైఎస్సార్సీపి పెళ్లకూరు మండల కన్వీనర్ మారాబత్తిన సుధాకర్ రూ.6,116లు, నాల్గవ స్థానంలో నిలిచిన ఎమ్మార్పీ క్లబ్ జట్టు చింతపూడి శ్రీధర్, షేక్ వసీమ్‌కు పురుషోత్తం రాజ్‌కుమార్ రూ.4,116లను అందించారు. అలాగే క్రీడలో మంచి ప్రతిభ చూపిన గూడూరుకు చెందిన సాయికి బెస్ట్ అఫెన్స్ క్రీడాకారునిగా కంకిపాటి కిరణ్‌కుమార్ రూ.1,116లు అందజేశారు. బెస్ట్ అఫెన్స్ క్రీడాకారునిగా గూడూరుకు చెందిన హర్షకు బయ్యా రమేష్ రూ.1,116లు అందజేశారు.

# ముందుజాగ్రత్తతోనే స్వైన్‌ఫ్లూ నివారణ



**- కె.గౌరీనాథ్, పల్మోనాలజిస్ట్, అపోలో హాస్పిటల్, నెల్లూరు.**



***ప్రపంచాన్నే వణికిస్తున్న స్వైన్‌ఫ్లూ ఇప్పుడు మన ఊరికి కూడా పాకింది. స్వైన్‌ఫ్లూ వచ్చిన తర్వాత నివారణకంటే, ముందుజాగ్రత్తతో దానిని రాకుండా నిరోధించడమే మేలని, కొన్ని సాధారణ జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా స్వైన్‌ఫ్లూ తమ దరికి చేరకుండా కాపాడుకోవచ్చునని నెల్లూరు అపోలో ఆసుపత్రిలోని పల్మోనాలజిస్ట్‌గా సేవలందిస్తున్న కె.గౌరీనాథ్ అభిప్రాయపడుతున్నారు. ఆయన మాటల్లోనే జాగ్రత్తలు తెలుసుకుందాం...***

ప్రస్తుతం మన దేశంలో స్వైన్‌ఫ్లూ గురించి జనంలో మళ్ళీ కలవరం మొదలైంది. దానికి ప్రధాన కారణం ఈ సంవత్సరం ఒక్క జనవరిలోనే 5000కు పైగా స్వైన్‌ఫ్లూ కేసులు నమోదు కావడం మరియు నాలుగు వందలకు పైగా వ్యాధిగ్రస్తులు మృత్యువాత పడడం, ప్రభుత్వ గణాంక వివరాల ప్రకారం గత సంవత్సరం స్వైన్‌ఫ్లూ వలన మరణించినవారి సంఖ్య 238మాత్రమే. 2011లో స్వైన్‌ఫ్లూ వలన కలిగిన మరణాలు 75మాత్రమే. ఈ సంవత్సరం రెండు నెలలు కూడా పూర్తి కాకుండానే నాలుగు వందలమందికి పైగా ఈ వ్యాధితో మృత్యు వాత పడడం ఆందోళన కలిగించే విషయం. దేశంలోనే అత్యధిక సంఖ్యలో స్వైన్‌ఫ్లూ కేసులు తెలంగాణ రాష్ట్రంలో నమోదు కావడం ఇంకా ఆందోళన కలి గించే విషయం. ఎందుకంటే ప్రతిరోజూ ఆంధ్రప్రాంతం నుంచి వందలాదిమంది ఏదో ఒక పని మీద హైదరాబాదుకు వెళ్లి వస్తుంటారు. వారిలో కొందరికి ఈ వ్యాధి సోకినా మిగతా వాళ్లకు వ్యాప్తి చెందే అవకాశం వుంది. ముఖ్యంగా బస్సులో గాని రైలులో గాని ప్రయాణీకుల మధ్య దగ్గినా, తుమ్మినా యితరులకు సులభంగా అంటుకొనే ప్రమాదం వుంది.

స్వైన్‌ఫ్లూ లక్షణాలను గమనిస్తే ఇది ఒక శ్వాస సంబంధమైన అంటు వ్యాధిగా గుర్తించడం జరిగింది. ఈ వ్యాధి సోకిన వ్యక్తికి చలిజ్వరం, ఒళ్ళునొప్పులు, తల నొప్పి, తుమ్ములు, దగ్గు, గొంతు నొప్పి అకస్మాత్తుగా రావడం జరుగుతుంది. చాలా నీరసంగా ఉండడంతో పాటు కొంతమందిలో వాంతులు, విరోచనాలు కలుగవచ్చు. ఈ వ్యాధి సోకిన మొదటి నాలుగురోజులు ఈ వ్యాధిని ఇతరులకు చాలా సులభంగా అంటించే అవకాశం ముంది. చిన్నపిల్లలు ఈ వ్యాధిని 10 రోజుల వరకు యితరులకు కలుగజేసే అవకాశం వుంది. స్వైన్‌ఫ్లూ వ్యాధితో బాధపడుతున్న వ్యక్తి దగ్గినా, తుమ్మినా సమీపంలో వున్న వ్యక్తి కంటిలో గాని, ముక్కులో గాని, నోట్లో గాని వైరస్ గల తుంపర్లు పడి ఆ వ్యక్తిలో ఈ క్రిములు ప్రవేశిస్తాయి. ఈ దగ్గు ద్వారా, తుమ్ముల ద్వారా గాలిలో వ్యాధికి చెందిన తుంపర్లు, దగ్గరలో వున్న వ్యక్తికి గాలితో పాటు పీల్చుకోవడం ద్వారా కూడా ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. స్వైన్‌ఫ్లూ గల వ్యక్తి దగ్గినపుడు, తుమ్మినపుడు ఈ వైరస్ కలిగిన తుంపర్లు, టేబుల్ పైన గాని, తలుపులపై గాని, టెలిఫోన్‌పై గాని, సోఫాపై గాని, పేపర్లపై గాని పడే అవకాశం వుంది. ఈ వైరస్ వాటిపై చల్లని వాతావరణంలో కొన్ని గంటల పాటు జీవించి వుండే అవకాశం వుంది. ఎవరైనా పొరపాటున వీటిని తాకి, తరువాత అదే చేత్తో ముఖానికి గాని, కళ్లకు గాని, నోటిపై గాని రుద్దుకుంటే వెంటనే ఈ వైరస్ వారి శరీరంలో ప్రవేశించే వీలు కలుగుతుంది.

కాబట్టి ఎవరైనా దగ్గు గాని తుమ్ములు గాని వస్తే ముఖానికి గుడ్డ అడ్డం పెట్టుకుంటే యితరులను వ్యాధి బారిన పడకుండా కాపాడవచ్చు. దగ్గిన తరువాత కాని, తుమ్మిన తరువాత గాని చేతులు శుభ్రంగా సబ్బుతో కడగకుండా చేతులు పై తాకరాదు. స్వైన్‌ఫ్లూ లక్షణాలు గల వ్యక్తి ఇంటికే పరిమితమైతే ఇతరుల వలన ఈ వ్యాధిని వ్యాపించకుండా అరికట్టవచ్చు. ఒకవేళ తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు రావలసి వస్తే ముఖానికి మాస్క్ ధరించడం తప్పనిసరి. ఆరోగ్యవంతులు ముఖానికి మాస్క్ ధరించడం వలన ఈ వ్యాధి రాకుండా తప్పించుకొనే వీలు లేదు. టీకా వేయించుకోవడం ద్వారా మాత్రమే ఈ వ్యాధి నుంచి రక్షణ పొందే అవకాశం వుంది. ప్రతి వ్యక్తి టీకా వేయించుకుంటే మంచిది. కాని ఈ వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉండే చిన్నపిల్లలు, గర్భిణీ స్త్రీలు, ఇప్పటికే దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు, వ్యాధినిరోధక శక్తి చాలా తక్కువగా ఉన్నవాళ్లు తప్పకుండా టీకా వేయించుకోవాలి. ఎందుకంటే ఈ వ్యాధి నుంచి ఒక వారంలో అత్యధిక శాతం పూర్తిగా కోలుకుంటారు. చాలామందికి ఈ వ్యాధి లక్షణాలు చాలా స్వల్పంగా మాత్రమే ఉంటాయి. ఈ టీకా ద్వారా కేవలం ఒక సంవత్సరం మాత్రమే రక్షణ ఉంటుంది. అంటే ప్రతి సంవత్సరం స్వైన్‌ఫ్లూ టీకా వేయించుకోవడం తప్పనిసరి. గతంలో టీకా వేయించుకున్న వాళ్లకు తరువాత వచ్చే స్వైన్‌ఫ్లూ వ్యాధి అంత ప్రమాదకరంగా ఉండే అవకాశం తక్కువ.

2009లో ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలను భయపెట్టిన స్వైన్‌ఫ్లూ ప్రస్తుతం మిగతా స్వైన్‌ఫ్లూతో పాటు చలికాలంలో కొంతవరకు వ్యాధిని కలుగజేసే స్థాయికి పడిపోయింది. అయినా ఈ సంవత్సరం ఈ వ్యాధితో చాలా సులభంగా వ్యాధిగ్రస్తులు కావడానికి అసాధారణమైన చలి వాతావరణం ఇంకొక కారణం కావచ్చునని వైద్య నిపుణులు భావిస్తున్నారు. ఈ వ్యాధి చికిత్స కొరకు ప్రభుత్వం మందులు అందుబాటులో ఉంచవలసిన అవసరం ఉంది. ఈ వ్యాధి లక్షణాలు తీవ్రంగా వుంటే వ్యాధి నిర్ధారణ కొరకు ఆలస్యం చేయకుండా వెంటనే చికిత్స ప్రారంభించాలి. 5రోజుల పాటు మందులు యిస్తే ఈ వ్యాధి లక్షణాలను తగ్గించి, త్వరగా కోలుకునేటట్లు చేయవచ్చు.

## ఈ విద్యా సంవత్సరం నుండి
# 'రత్నం' జూనియర్ కాలేజీలు



1984లో సొంత పేరునే సంస్థ పేరుగా పెట్టి రత్నం కోచింగ్ సెంటర్స్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు సాధించి ఎంతోమంది విద్యావేత్తలకు విద్యాసంస్థల యాజమాన్యానికి స్ఫూర్తి దాయకంగా నిలిచిన కె.వి.రత్నం గారి ఆధ్వర్యంలో జూనియర్ కాలేజీలు ప్రారంభోత్స వానికి ఈ యేడాది నుండి శ్రీకారం చుట్టబోతు న్నారు. గతంలో జూనియర్ కాలేజీలు నిర్వ హించినప్పటికీ అనారోగ్య వాతావరణంలో పోటీధోరణిలో వింత పోకడతో కొన్ని విద్యా సంస్థలు అవలంభించిన పోకడలను జీర్ణించుకోలేక ఇంటర్మీడియట్ విద్యకు స్వస్థి చెప్పి స్కూళ్ళపైనే ఎక్కువగా దృష్టి సారించింది "రత్నం" కుటుంబం.

ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా వేలాదిమంది విద్యార్థినీ విద్యార్థులు రత్నం స్కూళ్ళలో తమ భవిష్యత్తుకు బంగారుబాటలు వేసుకుంటున్నారు. తమ పిల్లలను రత్నం సంస్థలలోనే ఇంటర్మీడియట్ వరకు చదివించాలన్న వందలాదిమంది తల్లిదండ్రుల కోరిక మేరకు మళ్ళీ జూనియర్ కాలేజీలను ఈ యేడాది నుండి ప్రారంభించనున్నట్లు తెలిసింది.

"రత్నం" సంస్థలంటే క్రమశిక్షణకు, నాణ్యమైన విద్యకు భరోసాగా పేరుంది కాబట్టి తమ బిడ్డల భవిష్యత్తును నిర్ణయించే కీలక దశ ఇంటర్మీడియట్ కూడా ఇక్కడే చదివితే బాగుంటుందన్నది తల్లిదండ్రుల ఆలోచన. వారి ఆలోచనలకు అనుగుణంగానే అత్యాధునిక వసతులతో సరిక్రొత్త విద్యా విధానాలతో రత్నం జూనియర్ కాలేజీలను "రత్నం" మాష్టారు ప్రారంభించనున్నట్లు తెలిసింది. ఆల్ ది బెస్ట్ టూ రత్నం టీమ్.

# శివ నామ స్మరణతో మార్మోగిన ఆలయాలు



మూలాపేట శివాలయంలో జెండా ఊపి రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న నెల్లూరునగర ఎమ్మెల్యే అనిల్

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మంగళవారం జిల్లాలోని శైవాలయాలన్నీ శివనామ స్మరణతో మార్మోగాయి. 'హర హర మహాదేవ.. శంభో శంకర.. ఓం నమ:శివాయ' అంటూ భక్తులు పెద్దపెట్టున శివనామ జపాలతో ఆలయాలను హోరెత్తించారు. మహాశివ రాత్రి పవిత్ర పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయాలు క్రిక్కిరిసి పోయాయి. ఏ ఆలయంలో చూసినా భక్తులు పెద్దసంఖ్యలో బారులు తీరి వుండడం కనిపించింది. ఈ సందర్భంగా ఆలయాల ప్రాంగణాలు విద్యుత్ దీప కాంతుల శోభతో దేదీప్యమానంగా వెలిగి పోయాయి. ఆలయాల్లో మహాదేవునికి ప్రత్యేక పూజలు, అలంకారాలు చేశారు. అష్టోత్తర శతనామాలు, అభిషేకాలతో విశేష పూజలు చేశారు.

నెల్లూరులోని శ్రీ భువనేశ్వరీదేవీ సమేత మూలస్థానేశ్వర స్వామి దేవాలయంలో స్వామివారికి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు అంగరంగవైభవంగా జరుగుతున్నాయి. నిత్యం పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా, నగరంలోని దర్గామిట్టలో వున్న సుందరేశ్వర సమేత శ్రీ రాజరాజేశ్వరిదేవి ఆలయంలో, ఉస్మాన్ సాహెబ్‌పేటలోని అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరాలయంలో, సంతపేట కంసాలి వీధిలో వున్న శ్రీ భ్రమరాంబాదేవి సమేత శ్రీ హరిహర నాధస్వామి ఆలయంలో, నవాబ్‌పేటలోని శ్రీ భ్రమరాంభ మల్లేశ్వరస్వామి ఆలయం, తదితర అన్ని శైవాలయాల్లోనూ స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లాలోనూ అన్ని చోట్లా వున్న శివాలయాల్లో, ప్రత్యేకించి ప్రసిద్ధి చెందిన శైవక్షేత్రాల్లో మహాశివరాత్రి వేడుకలు, బ్రహ్మోత్సవాలు మరింత వైభవంగా జరిగాయి. జొన్నవాడలో వెలసివున్న ప్రసిద్ధ క్షేత్రమైన శ్రీ కామాక్షితాయి సమేత శ్రీ మల్లికార్జున స్వామివారి ఆలయంలో అత్యంత వైభవంగా మహాశివరాత్రి వేడుకలు నిర్వహించారు. విడవలూరు మండలం లోని రామతీర్థంలో వున్న మరో ప్రముఖ క్షేత్రం శ్రీ రామలింగేశ్వరస్వామి దేవాలయంలోనూ, పార్లపల్లి గ్రామంలో వున్న కామాక్షీదేవి ఆలయంలోనూ, ఊటుకూరులోని సాగరేశ్వరస్వామి ఆలయంలోనూ, ముదివర్తిలోని శనీశ్వర చక్రవర్తి ఆలయంలోనూ, రాపూరు మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోన క్షేత్రంలో శ్రీ మణిద్వీప మహా సంస్థానంలో, రాపూరు శివాలయంలోనూ మహాశివరాత్రి వేడుకలు కన్నుల పండువగా జరిగాయి.

జిల్లాలోని ప్రసిద్ధమైన శైవక్షేత్రాలున్న జొన్నవాడ, నెల్లూరు మూలాపేట, పంట్రంగం, గండవరం, రామతీర్థం, సిద్ధేశ్వరం, సోమశిల, కోటితీర్థం, కాటేపల్లి, దేవుని వెల్లంపల్లి, భైరవకోన, రాపూరు మండలంలోని వెలిగొండల్లో వెలసివున్న ప్రముఖ క్షేత్రాలైన సిద్ధులయ్య కోన, మల్లయ్య కోన, ఈశ్వరబుగ్గ తదితర ఆలయాల్లోనూ మహాశివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి.


అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు


# పేదప్రాంతాలపై ప్రత్యేక దృష్టి



పేదలు నివశిస్తున్న ప్రాంతాలపై ప్రత్యేకదృష్టి పెట్టి, వాటి అభివృద్ధికి కృషి చేస్తానని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఈనెల 19వతేదీన నెల్లూరు రూరల్ మల్లాయగుంటలో నూతనంగా నిర్మించనున్న సిమెంటు రోడ్డుకు మేయర్ అబ్దుల్ అజీజ్‌తో కలసి ఆయన శంకుస్థాపన చేశారు. నియోజకవర్గంలో ప్రతిఒక్కరి సలహాలు తీసుకుంటూ అందరి సహకారంతో నియోజక వర్గంలోని సమస్యలను తీరుస్తానన్నారు. మేయర్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ ప్రజల కోసం నిరంతరం శ్రమించే వ్యక్తిగా కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని అభివర్ణించారు. ఈ ప్రాంతానికి అవసరమైన ఎల్ఇడి లైట్లు, పోలీస్ అవుట్‌పోస్ట్ కోసం కృషి చేస్తానని అజీజ్ చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు నూనె మల్లిఖార్జునయాదవ్, కె.సంపూర్ణ, టి.అనిత, ఎం.వెంకటేశ్వర్లు, ఎం.పెంచలయ్య, వైకాపా నాయకులు బి.శ్రీకాంత్‌రెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.







# సోమిరెడ్డి వారి రిసెప్షన్ వేడుక

మాజీమంత్రి, తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సోదరుడు హర్షవర్ధన్‌రెడ్డి-ప్రశాంతిల కుమారుడు **అర్జున్ - లక్ష్మీ ఇషిత**ల వివాహ రిసెప్షన్ వేడుకలు ఈ నెల 8వ తేదీ నెల్లూరులోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో కనుల విందుగా జరిగాయి. అనేకమంది రాజకీయ నాయకులు, వివిధ రంగాల ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, వధూవరుల బంధుమిత్రులు, సోమిరెడ్డి అభిమానులు పెద్ద సంఖ్యలో విచ్చేసి వధూవరులను ఆశీర్వదించి వెళ్ళారు.



## 'ప్రభా'తం

# 'మైత్రీ' బంధం



*భారత్-శ్రీలంక దేశాల మధ్య స్నేహాను బంధానికి బాటలు వేస్తూ, శ్రీలంక నూతన అధ్యక్షుడుగా ఎన్నికైన తర్వాత మైత్రీపాల సిరిసేన తన తొలి విదేశీ పర్యటనకు భారతదేశాన్నే ఎన్నుకోవడం, ఆ మేరకు ఇటీవల ఆయన భారత్‌లో తొలి పర్యటన గావించడం, పౌర అణుఒప్పందం జరగడం ఇరు దేశాల మైత్రీయానానికి ఒక శుభ పరిణామంగా భావించవచ్చు. భారత్-శ్రీలంకల స్నేహయాత్రలో ఇదొక మేలు మలుపుగానూ చెప్పవచ్చు.*

**భా**రత్-శ్రీలంకల మధ్య ఇన్నాళ్ళుగా వున్న ఎడం తగ్గిపోయి.. మళ్ళీ స్నేహానుబంధం విరాజిల్లే మంచిరోజులు వస్తున్నాయి. గతంలో వున్న శ్రీలంక అధ్యక్షుని పాలనలో కోల్పోయిన మైత్రీ బంధాన్ని తిరిగి పునరుద్ధరించుకునేందుకు శ్రీలంక కొత్త అధ్యక్షుడు మైత్రీపాల సిరిసేన కృషి చేస్తుండడం ఒక సంతోషకర పరిణామం. భారత్-శ్రీలంక దేశాల మధ్య ఈ సరికొత్త స్నేహానుబంధానికి బాటలు వేస్తూ, శ్రీలంక నూతన అధ్యక్షుడుగా ఎన్నికైన తర్వాత మైత్రీపాల సిరిసేన తన తొలి విదేశీ పర్యటనకు భారతదేశాన్నే ఎన్నుకోవడం, ఆ మేరకు ఇటీవల ఆయన భారత్‌లో తొలి పర్యటన గావించడం ఇరు దేశాల మైత్రీయానానికి ఒక శుభ పరిణామంగా భావించవచ్చు. భారత్-శ్రీలంకల స్నేహయాత్రలో ఇదొక మేలు మలుపుగానూ చెప్పవచ్చు. ఈ సందర్భంగా ఇరు దేశాల సంబంధాలను మరింత ద్విగుణీకృతం చేసే దిశలో భారత్-శ్రీలంక పౌర అణు ఒప్పందంపై సంతకాలు చేయడం విశేషం. ఇరుదేశాలూ రక్షణ, భద్రతపరమైన సహకారాన్ని పరస్పరం అందించుకోవాలని అటు భారత ప్రధాని నరేంద్రమోడీ, శ్రీలంక అధ్యక్షుడు మైత్రీపాల సిరిసేన సంయుక్తంగా ఆశిస్తూ వివిధ అంశాలపై చర్చలు జరపడం ఇరు దేశాల స్నేహాన్ని పరిమళింపజేసే విషయాలే. పౌర అణు సహకారంపై ఒప్పందం కుదుర్చుకోవడం రెండు దేశాల మధ్య వున్న పరస్పర విశ్వాసానికి నిదర్శనమని ప్రధాని మోడీ ఈ సందర్భంగా పేర్కొన్నారు కూడా. శ్రీలంక ఇలాంటి ఒప్పందాన్ని చేసుకోవడం ఇదే ప్రధమమనీ, అంతేకాక ఆరోగ్య రక్షణ, వ్యవసాయం తదితర రంగాల్లో సహకారానికి ఈ నిర్ణయం బాటలు వేస్తుందనీ ఆయన అన్నారు. రెండు దేశాల గమ్యాలూ ఒకదానికొకటి అనుసంధానమై వున్నాయని, భద్రత-సౌభాగ్యాల్లో ఈ రెండు దేశాలను విడదీయలేమని, ద్వైపాక్షిక సంబంధాలపై, అంతర్జాతీయ సంబంధాలపై విశేషమైన చర్చలే జరిగాయని ప్రధాని పేర్కొన్నారు. మైత్రీపాల సిరిసేన శ్రీలంక నూతన అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలి పర్యటన భారత్‌తోనే ప్రారంభించడం మనదేశానికి ఇచ్చిన గౌరవంగా భావిస్తున్నామన్నారు. శ్రీలంక మనకు సన్నిహితమైన స్నేహపూర్వక పొరుగుదేశమని, భారత ప్రజల మద్దతు, సౌహార్ధ్రత శ్రీలంకకు ఎల్లప్పుడూ వుంటాయని, సరిహద్దుల్లో మత్స్యకారుల సమస్యలపైనా చర్చించామని, ఈ సమస్యలను నిర్మాణాత్మక మానవీయ కోణంలో పరిష్కరించాలని నిర్ణయించామని ఆయన స్పష్టం చేశారు. అదేవిధంగా, ఈ చర్చల ఫలితాల పట్ల శ్రీలంక అధ్యక్షుడు మైత్రీపాల సిరిసేన కూడా సంతృప్తిని వ్యక్తం చేశారు. రెండు దేశాల మధ్య మైత్రి పరస్పర ప్రయోజనకరమే కాక, ఈ ప్రాంతానికి ఎంతో ముఖ్యమని కూడా ఆయన అన్నారు. రెండు దేశాల సంబంధాలను బలోపేతం చేసేందుకు ప్రధాని మోడీ తీసుకుంటున్న చర్యలను మైత్రీపాల సిరిసేన ఈ సందర్భంగా కొనియాడారు. ఏదేమైనా, ఇరుదేశాలు సౌహార్ధ్రపూరిత వాతావరణంలో చర్చలు జరుపుకోవడం, స్నేహభావాన్ని పెంపొందించుకునేందుకు ప్రయత్నించడంతో రెండు దేశాల మధ్య అనేక అంశాలపై జరిగిన చర్చలు సఫలీకృతమయ్యాయని భావించవచ్చు. వీటిలో ప్రధానమైన పౌర అణు ఒప్పందంతో పాటు, ఎంతోకాలం నుంచి అందరూ ఆశిస్తున్న నలంద విశ్వవిద్యాలయం పునర్నిర్మాణంలో శ్రీలంక భాగస్వామ్యానికి వీలుగా అవగాహన పత్రంపై ఒప్పందం కూడా కుదరడం మరొక సంతోషకరమైన అంశం. రెండు దేశాల మధ్య ఎంతోకాలంగా నెలకొనివున్న సంక్లిష్టమైన వాతావరణాన్ని అధిగమించి సాధారణ స్థాయికి వచ్చేందుకు ఇలాంటి ఒప్పందాలు ఎంతో ఉపకరిస్తాయనడంలో సందేహం లేదు. అందులోనూ పౌర అణు ఒప్పందం రెండు దేశాల మైత్రీబంధాన్ని మరింత బలోపేతం చేస్తుందని కూడా గట్టిగా అనుకోవచ్చు. ఈ ఒప్పందంలో భాగంగా, అణు సంబంధిత సాంకేతికతను బదలాయించుకోవడం, వనరులను పంచుకోవడం, సిబ్బందికి శిక్షణ, రేడియో ఐసోటోపుల వినియోగం, అణు భద్రత, రేడియో ధార్మికత నుంచి రక్షణ వంటి అంశాల్లో ఇరు దేశాలూ సహకరించుకుంటాయి. రేడియో ధార్మిక వ్యర్థాల యాజమాన్యం, అణు విపత్తులను తట్టుకోవడం, పర్యావరణ పరిరక్షణ రంగాల్లోనూ సహకారాన్ని అందించుకోవడం ఈ ఒప్పందంలో ముఖ్యమైనవి. ఇలాంటి కీలకమైన ఒప్పందాలకు రావడం రెండు దేశాల మధ్య సయోధ్యకు మంచి వాతావరణం ఏర్పడినట్లేనని భావించవచ్చు. దీంతో, భారత్-శ్రీలంకల మధ్య నూతనంగా మరింత స్నేహసౌహార్ధ్రతలు పెంపొందుతాయని ఆశించవచ్చు. ముఖ్యంగా మత్స్యకారుల సమస్యల విషయంలో ఆచితూచి వ్యవహరించడం, మానవతా ధృక్పధంతో వారి సమస్యలు పరిష్కరించాలని రెండు దేశాల అధినేతలూ నిర్ణయించుకోవడం మంచి పరిణామమే. ఎంతోకాలంగా జటిలంగా వున్న ఈ సమస్యను రెండు దేశాల మత్స్యకారులతోనూ సంయమనంగా చర్చించి, సానుకూల, స్నేహపూరిత వాతావరణంలో ఆ సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయడం వల్ల సత్ఫలితాలు వుంటాయని ఎంతైనా ఆశించవచ్చు.. శ్రీలంక అధ్యక్షునితో జరిపిన చర్చల్లో ప్రధానంగా, ఆర్థిక సహకారానికి ఉన్న అపార అవకాశాలను సమగ్రంగా చర్చించామని, భారత్‌నుంచి పెట్టబడులు పెట్టడంతో పాటు, పర్యాటకులను శ్రీలంకకు పంపడానికి సంసిద్ధత వ్యక్తం చేశామని, గగనతల, సముద్రయాన సంబంధాలను మరింత మెరుగుపరచుకుంటామని, సంప్రదాయ పునరుత్పాదక ఇంధన రంగాల్లోనూ సహకారాన్ని విస్తరించుకోవడంపై చర్చలు జరిపామని ప్రధాని మోడీ శ్రీ లంక అధ్యక్షునితో జరిపిన చర్చల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు కూడా. ఆ మేరకు త్వరలో రెండు దేశాల వాణిజ్య కార్యదర్శులు సమావేశమవుతారని అంటూ, క్రికెట్ మాదిరిగానే సాంస్కృతిక సహకారంతోనూ రెండు దేశాల మధ్య బంధాలు పలపడతాయని ప్రధాని మోడీ ఆకాంక్షించారు. అలా ఇరు దేశాల అధినేతలూ ఎంతో స్నేహపూర్వకంగా చర్చలు జరుపుకుని భవిష్యత్‌లో చేపట్టదలచిన అంశాలను మనసు విప్పి మాట్లాడుకోవడం ద్వారా, జటిలమైన పలు సమస్యల సానుకూల పరిష్కారానికి కూడా ఈ చర్చల ద్వారా మంచి దారులు వేసుకున్నారు. రెండు దేశాల మధ్య స్నేహబంధం మరింతగా పరిమళించేందుకు ఈ చర్చలు ఎంతగానో ఉపకరించాయనే చెప్పవచ్చు. అంతేకాదు, ప్రధాని మోడీని తమ దేశంలో పర్యటించాలని శ్రీలంక అధ్యక్షుడు మైత్రీపాల సిరిసేన కోరగా, అందుకు ప్రధాని మోడీ సమ్మతించడం, మార్చిలో వస్తానని తెలియజేయడంతో, ప్రధాని శ్రీలంక పర్యటనతో ఆ దేశంతో స్నేహానుబంధం మరింతగా పెంపొందవచ్చని కూడా భావించవచ్చు. శ్రీలంకలో ఇటీవలి కాలంలో మారిన పరిస్థితులు, అటు శ్రీలంకలోనూ, ఇటు భారత్‌లోనూ ఇటీవలి కాలంలో కొత్త నాయకత్వాలు రావడంతో ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాల్లో నూతన అధ్యాయం ఆరంభించడానికి మంచి అవకాశాలు కల్పిస్తున్నాయి. ఏదేమైనా ఇరు దేశాల స్నేహ బంధానికి ఈ చర్చలు ఎంతగానో ఉపకరించాయనుకోవచ్చు.

# పుడితే.. ఇలాంటి కూతురే పుట్టాలి

**- తల్లికి దహనసంస్కారం చేసిన తనయ**

పుడితే కూతురే పుట్టాలి..అన్నమాట అక్షరాలా రుజువైన మరో సందర్భం ఇది. ఆడపిల్లలే పుట్టారని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కూతురు పుట్టినా కుమారుడిలాగానే అన్ని పనులూ ఎంతో నిబ్బరంగా నిర్వహిస్తుందని చాటుతూ కోవూరులోని ఒక అమ్మాయి, ధైర్యంగా స్మశానానికి వెళ్ళి అమ్మకు దహనసంస్కారాలు నిర్వహించి అమ్మ రుణం తీర్చుకుంది. కోవూరు పట్టణంలోని సుబ్బారెడ్డిగుంట కాలనీలో ఇటీవల ఈ సంఘటన జరిగింది. ఆ కాలనీలో నివసిస్తున్న చెంచమ్మ అనే మహిళకు ఇద్దరు కుమార్తెలున్నారు. కుమారులెవరూ లేరు. కాగా, ఇటీవల అనారోగ్యం పాలైన చెంచమ్మ(62) సోమవారం తీవ్ర అస్వస్థతకు గురై మరణించింది. తల్లిని పోగొట్టుకున్న ఆ కుమార్తెలిరువురూ శోకసాగరంలో మునిగిపోయారు. వారిని ఓదార్చేందుకు వచ్చిన వారంతా, ఆ ఆడపిల్లల రోదన చూసి కంటతడిపెట్టారు. అయితే, కుమారులు లేని ఆమెకు ఇప్పుడు దహన సంస్కారాలు ఎవరు చేయాలి.. అని బంధువులు తర్కించకుంటుండగా, కుమార్తె అయిన కమలమ్మ ధైర్యంగా ముందుకు వచ్చి ఆ కార్యక్రమం తాను నిర్వహిస్తానని, ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని చెప్పింది.

అలా చెప్పడమే కాదు, సంప్రదాయ బద్ధంగా తల్లికి కడసారి సంస్కారాలను నిర్వహించి అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. స్మశానానికి వెళ్ళి దహన సంస్కారాలను స్వయంగా నిర్వహించి అమ్మ రుణం తీర్చుకుంది. సాధారణంగా, హిందూ సంప్రదాయంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడానికి ఆడవారు స్మశానానికి వెళ్ళడం జరుగదు. అయినా, కుమారులెవరూ లేని ఆ తల్లికి ఎలాంటి లోటు కలగకుండా ఆ కుమార్తె స్మశానానికి వచ్చి, తల్లికి దహనసంస్కారాలు నిర్వహించి అందరి ప్రశంసలకూ పాత్రమైంది. పుడితే కూతురే పుట్టాలి..అందులోనూ కమలమ్మ లాంటి కూతురే పుట్టాలని బంధువులంతా ఆమెను మెచ్చుకున్నారు.

# చేనేత కార్మికులకు పింఛన్లు

నెల్లూరుజిల్లాలోని పింఛనుకు అర్హత వున్న చేనేత కార్మికులకు పింఛన్లు మంజూరు అయ్యాయని చేనేత జౌళిశాఖ సహాయ సంచాలకులు తెలిపారు. నెల్లూరుజిల్లాలోని 42మండలాల్లోను, 6మునిసిపాలిటీల్లోనూ మొత్తం 4,622 మంది చేనేత కార్మికులకు జిల్లా కలెక్టర్ చేనేత పింఛన్‌లు మంజూరు చేసారన్నారు. ఇకపై వారు గ్రామ తపాలాశాఖ బ్రాంచ్ పోస్టుమాస్టర్, పట్టణ పోస్టుమాస్టర్ ద్వారా 2015 ఫిబ్రవరి నెల నుండి పింఛన్లు తీసుకోవాలన్నారు.

# పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

పదేళ్ళ క్రితం నెల్లూరు సమీపంలోని కొత్తూరుకు చెందిన పేదలకు మంజూరు చేసిన పట్టాలకు సంబంధించి ఇళ్ళ స్థలాలు కేటాయించాలని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆ మేరకు బాధితులు సోమవారం కలెక్టరేట్ వద్ద నిర్వహించిన ధర్నా సందర్భంగా సురేష్‌రెడ్డి మాట్లాడుతూ కొత్తూరులో అద్దెఇళ్ళలో వుంటున్న 500మంది పేదలకు గతంలో నివేశన పట్టాలు మంజూరు చేశారని, ఆ స్థలాలు ఇళ్ళ నిర్మాణాలకు అనుకూలంగా లేకపోవడంతో పేదలు ఇప్పటికీ అద్దెఇళ్ళలోనే వుంటూ ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి ఆ పేదలకు ఇళ్ళు నిర్మించుకునేందుకు అనుకూలమైన స్థలాలు కేటాయించాలని ఆయన కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.




## ఇది దేశాల మధ్య యుద్ధం కాదు

ప్రపంచకప్‌లో భారత్–పాకిస్థాన్‌ల మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్‌ను ఇరుదేశ సైన్యాల మధ్య జరిగిన యుద్ధంలా చిత్రించారు. దీనిని ఒక ఆటగా చూడలేదు. మ్యాచ్ ముగిసాక ఇరుదేశాలలోనూ భావోద్వేగాలు రేగాయి. ఇండియాలో సంబరాలు చేసుకుంటే పాకిస్థాన్‌లో టీవీలు పగలగొట్టారు. ఈ రెండు దేశాల మధ్య మ్యాచ్ జరిగినప్పుడే ఈ ఉద్వేగాలొస్తున్నాయి. మిగిలిన ఏ దేశంతోనూ జరిగే మ్యాచ్‌లోనైనా గెలుపోటములను ఇరు దేశాల అభిమానులు సాధారణంగానే స్వీకరిస్తున్నారు. ఇరు దేశాలలోనూ ఒకరిపై ఒకరికి ద్వేష భావం వుంది. ఈ ప్రభావం క్రికెట్ మీద పడుతుంది. ఆటను ఆటగా కాకుండా ఒక ఉన్మాదక్రీడగా చూస్తున్నారు.

**పి. కిషోర్, హైదరాబాద్.**

## ఢిల్లీ ఓటమితో మునిగేదేమీ లేదు

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అగ్రనేతలు చేసిన తప్పిదాలు అరవింద్ కేజ్రీవాల్‌కు వరమయ్యాయి. కాంగ్రెస్ ఓటుబ్యాంకు కూడా కేజ్రీవాల్‌కు కలిసొచ్చింది. ఢిల్లీలో ఓడిపోయినంత మాత్రాన దేశమంతా నరేంద్ర మోడీ ప్రతిష్ట మసకబారిందనుకుంటే పొరపాటే! ఆరునెలల్లోనే అద్భుతాలు చేసి చూపడానికి మోడీ మాంత్రికుడు కాదు. ప్రధాని అయినప్పటి నుండి అహర్నిశలు కష్టపడుతున్నాడు. దేశ ప్రజలందరూ శ్రమించాలని చెబుతున్నాడు. అవినీతికి తావులేని పరిపాలన చేస్తున్నాడు. గత పదేళ్ల కాంగ్రెస్ అవినీతి పాలన కంటే మోడీ పాలన వెయ్యిరెట్లు నయం.

**బండి కృష్ణవేణి, నెల్లూరు.**

## డాబు తగ్గించు బాబు

చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం రైతులకు శాపంగా మారుతోంది. గుంటూరుజిల్లాలో సారవంతమైన భూములనేవి రాష్ట్రానికి లభించిన వరం. ఇక్కడ వ్యవసాయ ఉత్పత్తులు అధికంగా ఉంటాయి. చంద్రబాబు ఇక్కడ రాజధాని ఏర్పాటు చేయాలనుకోవడం నీడనిచ్చే చెట్టును నరుక్కోవడమన్నట్లుగా వుంది.

**ఎన్.సాంబశివరావు, నర్సారావుపేట.**

# కుదేలైన కట్టుబడి



ఏ దేశ లేదా రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలోనైనా నిర్మాణ రంగానిది కీలకపాత్ర. ఈ రంగంతో అనేక వ్యాపారాలకు సంబంధాలుంటాయి. నిర్మాణరంగం చురుకుగా వుంటేనే స్థలాల కొనుగోళ్లు, అమ్మకాలు జరుగుతుంటాయి. నిర్మాణ రంగం వేగంగా వుంటే సిమెంట్, స్టీలు, ఉడ్, ఇటుక, ఇసుక వంటి వ్యాపారాలు జోరుగా సాగుతుంటాయి. గ్లాసులు, రంగులు, ఇతర గృహోపకరణాల మెటీరియల్‌కు సంబంధించిన వ్యాపారాలన్నీ కూడా నిర్మాణరంగంతోనే ముడిపడి వుంటాయి. అంతెందుకు లక్షలాదిమంది భవన నిర్మాణ కార్మికులకు బ్రతుకు మార్గం నిర్మాణ రంగమే.

- వందలాది అపార్ట్‌మెంట్లలో ఖాళీలు
- నిర్మాణ దశలోనే ఆగిన భవనాలు
- అనుమతులలో విపరీత జాప్యం
- చుక్కలు చూపిస్తున్న సిమెంట్, ఇసుక ధరలు
- నిర్మాణాల జోలికి వెళ్లని బిల్డర్

గత కొన్నేళ్లుగా నిర్మాణరంగం సంక్షోభంలో వుంది. దీనికి కారణం రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలే! ముఖ్యంగా మన నెల్లూరుజిల్లాలో నిర్మాణ రంగం చతికిలబడిపోయింది. పెద్ద సంఖ్యలో బిల్డర్‌లు భవనాలు, అపార్ట్‌మెంట్లు కట్టి వాటిని అమ్ముకోలేక, తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక అన్ని విధాలుగా నలిగిపోతున్నారు. దివంగత నేత వై.యస్. రాజశేఖరరెడ్డి హయాంలో జిల్లాలో నిర్మాణ రంగం మూడు ఇళ్లు... ఆరు భవనాలుగా వర్థిల్లింది. కృష్ణపట్నం పోర్టు, శ్రీసిటీ సెజ్ వంటి వాటితో పాటు జెన్‌కో, రిలయన్స్ వంటి పవర్ ప్రాజెక్టులు వస్తున్నాయనే ప్రచారంతో అప్పుడు అపార్ట్‌మెంట్లకు విపరీతమైన గిరాకీ ఏర్పడింది. ఇకముందు ఇంకా డిమాండ్ వస్తుందనే ఆశతో బిల్డర్‌లు నెల్లూరు నిండా కుప్పలు తెప్పలుగా అపార్ట్‌మెంట్ల నిర్మాణం చేపట్టారు. అవసరానికి మించి అపార్ట్‌మెంట్లు అందుబాటులోకి వచ్చాయి. అలాగే కమర్షియల్ భవనాలు కూడా పెద్దఎత్తున నిర్మించబడ్డాయి.

వై.యస్. మరణం నిర్మాణ రంగానికి తీరని కష్టం మిగిల్చింది. ఆయన మరణం తర్వాత నిర్మాణ రంగానికి బాధలు మొదలయ్యాయి. పూర్తయిన అపార్ట్‌మెంట్లలో అమ్మకాలు లేవు. కొనేవాళ్లు లేకపోవడంతో చాలా అపార్ట్‌మెంట్లు నిర్మాణం మధ్యలోనే ఆగిపోయాయి.

తెలుగుదేశం అధికారంలోకి వచ్చాక నిర్మాణరంగంలో కదలిక రావచ్చని బిల్డర్‌లు ఆశపడ్డారు. కానీ మరిన్ని కష్టాలు మొదలయ్యాయి. ఈ కొత్త ప్రభుత్వ విధానాలు బిల్డర్‌లకు ఏ విధంగానూ ఉపయోగపడలేదు. నిర్మాణాలకు అనుమతులు కావాలంటే మున్సిపాల్టీలలో అధికారులు బిల్డర్‌లకు చుక్కలు చూపిస్తున్నారు. ముడుపుల రేట్లను కూడా విపరీతంగా పెంచారు. కన్‌స్ట్రక్షన్స్ అప్రూవల్ ఫైల్స్ ముందుకు కదలడం లేదు. అధికారులపరంగా ఓ వైపు సమస్యలు... ఇంకోపక్క చూస్తే ఇసుక ధరలు కొనేటట్లు లేవు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇసుక తవ్వకాల మీద నిషేధం విధించినప్పుడు బ్లాక్‌మార్కెట్‌లో ఇసుక ధర ఎంత పలికిందో, ఇప్పుడు ప్రభుత్వం అదే ధరకు అధికారికంగా అమ్ముతోంది. ఇక సిమెంట్ చూస్తే బస్తా 380రూపాయలు. మార్కెట్‌లో ఇంత రేటు ఎప్పుడూ లేదు. కూలీల రేట్లు పెరిగాయి. ఒక కమర్షియల్ భవనం కట్టాలన్నా, అపార్ట్‌మెంట్ కట్టాలన్నా ఖర్చు తడిసి మోపెడవుతుంది. కట్టిన అపార్ట్‌మెంట్లను అమ్ముకోవడం కూడా కనాకష్టమవుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వంలో నన్నా నిర్మాణ రంగంలో అరకొర కదలిక వుండింది. బిల్డర్‌లు ఒకటి అరా ఫ్లాట్లు అమ్ముకున్నారు. చంద్రబాబు వచ్చాక ఆ అరకొర ఆశలు కూడా లేకుండాపోయాయి. బిల్డర్‌లు కొత్త అపార్ట్‌మెంట్ల జోలికి పోవడంలేదు. కట్టుకున్నవి అమ్ముడుపోతే చాలనుకుంటున్నారు. కన్‌స్ట్రక్షన్ రంగం సంక్షోభంలో ఉండడంతో ఒక్క నెల్లూరు జిల్లాలోనే వేలమంది భవన నిర్మాణ కార్మికులు పనులు లేక ఇబ్బందులు పడుతున్నారు. కొందరైతే ఇతర రాష్ట్రాలకు వలస కూడా పోతున్నారు.



## జిల్లా కాంగ్రెస్...
# ఇక ఆనంకే సొంతం

*జిల్లా కాంగ్రెస్‌పార్టీ... దాదాపు మూడు దశాబ్దాల పాటు దివంగత నేత నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి చేతుల్లోనే వుండింది. ఒకప్పుడు ఇండియా అంటే ఇందిర, ఇందిర అంటే ఇండియా అనే నినాదం ఎలా వుండిందో, నెల్లూరు కాంగ్రెస్ అంటే నేదురుమల్లే అనే నినాదం కూడా అలాగే వుండింది. అయితే నేదురుమల్లి మరణంతో పాటే ఈ రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ కూడా దాదాపు మరణావస్థకు చేరుకుంది. రాష్ట్ర విభజన అనే ఓ దిక్కుమాలిన నిర్ణయంతో ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ దిక్కు దిశాణం లేని అనాథగా మారింది.*

ఏ పార్టీలోకి పోలేక, ప్రాంతీయపార్టీలలోకి పోయి తమకంటే జూనియర్‌ల ముందు చేతులు కట్టుకుని నిలబడలేక ఆనం సోదరులు వంటి నాయకులు కాంగ్రెస్‌లోనే ఉండిపోయారు. రాష్ట్రం మొత్తం మీద కూడా కాంగ్రెస్‌లో ఇలా మిగిలిపోయిన నాయకులను వేళ్ల మీద లెక్కపెట్టవచ్చు.

ఇక ఐదేళ్లదాకా తమ పార్టీకి భవిష్యత్ లేదని వీళ్లకు తెలుసు. ఐదేళ్ల తర్వాతన్నా రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్‌ను మన్నిస్తారో లేదోననేది సందేహమే. ఎందుకంటే విభజన ద్వారా ఆ పార్టీ ఆంధ్రులకు చేసిన ద్రోహం అటువంటిది. విభజన నేరంలో అన్ని పార్టీలు నిందితులే అయినప్పటికీ ప్రధాన దోషిగా ప్రజలు తేల్చింది కాంగ్రెస్‌పార్టీనే కాబట్టి ఆ ప్రభావం ఆ పార్టీ మీద ఇంకొన్ని ఏళ్లపాటు ఉండడం ఖాయం.

రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ఇంత గడ్డుకాలం ఎప్పుడూ వచ్చి ఉండదు. దాదాపు మరణం అంచుల్లో వున్న కాంగ్రెస్‌ను బ్రతికించడం కష్టమే! అయినా ఈ జిల్లాలో కాంగ్రెస్‌కు మళ్లీ జీవంపోసే దిశగా ఆనం సోదరులు పావులు కదుపుతున్నారు. ప్రజల్లో ప్రభుత్వం పట్ల తీవ్రవ్యతిరేకత ఉంది. అయితే ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడడంలో ప్రధాన ప్రతిపక్షం వైకాపా నిర్మాణాత్మకంగా వ్యవహరించలేకపోతోంది. కాంగ్రెస్‌ను మళ్లీ ప్రజల్లోకి తీసుకుపోవడానికి దీనిని అనువైన సమయంగా ఆనం సోదరులు భావిస్తున్నారు. త్వరలోనే ప్రభుత్వ విధానాలపై వీధిపోరాటాలకు, ఆందోళనలకు సైతం సిద్ధపడుతున్నారు. ఒక్క నెల్లూరుజిల్లాకే పరిమితం కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా కూడా కాంగ్రెస్ పెత్తనాన్ని తమ చేతుల్లోకి తీసుకుని, పార్టీని మళ్లీ పట్టాలపైకి ఎక్కించే దిశగా ఆనం సోదరులు పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది.

# పదవికి దగ్గరలో...?



జిల్లాలో తెలుగుదేశంపార్టీనే నమ్ముకుని, ఆ పార్టీతోనే రాజకీయ భవిష్యత్‌ను ముడివేసుకుని, ఆ పార్టీ కోసం ఆర్థికంగానూ, వ్యక్తిగతంగానూ ఎన్నో ఎదురుదెబ్బలు తిని, ఆ పార్టీ ప్రగతి కోసం అహర్నిశలు శ్రమపడుతున్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కష్టానికి, అతనికి జరిగిన నష్టానికి తగిన ప్రతిఫలం రాబోతుందా? ఈ ప్రశ్నకు త్వరలోనే సమాధానం రావచ్చు. ఎందుకంటే సోమిరెడ్డి వంటి నిబద్ధతగల నాయకులను పక్కనపెడితే అది పార్టీకే నష్టం. కాబట్టి సోమిరెడ్డి రాజకీయ పటిమనాన్ని ఇటు పార్టీకి అటు ప్రభుత్వానికి వాడుకోవాలనే ఆలోచనలో చంద్రబాబు ఉన్నట్లుగా తెలుస్తోంది. అందుకనే ఆయనను శాసనమండలి సభ్యునిగా తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.

రాష్ట్రంలో ఎమ్మెల్యేల ద్వారా కొన్ని, గవర్నర్ కోటాలో కొన్ని, ఇక పట్టభద్రులు, ఉపాధ్యాయులు, స్థానిక సంస్థల నుండి కొన్ని మొత్తం 28ఎమ్మెల్సీలకు అవకాశముంది. ఈ నేపథ్యంలో జిల్లాలో అధికారపార్టీ ఎమ్మెల్యేలు ముగ్గురే వుండడం, ఎమ్మెల్సీలు కూడా ఇద్దరే వుండడంతో జిల్లా నుండి ప్రాతినిధ్యం పెంచే దిశగా మరో రెండు ఎమ్మెల్సీలు ఇచ్చే అవకాశాలున్నాయి. వాటిలో ఒకటి సోమిరెడ్డికి ఖాయమంటున్నారు. అది కూడా ఆయనను ఎమ్మెల్యేలు ఎన్నుకునే స్థానం నుండి ఎంపిక చేసే సూచనలున్నాయి.

జిల్లాలో పార్ట్‌టైం లీడర్లు ఎక్కువ. ఫుల్‌టైం లీడర్లు తక్కువగా వున్నారు. ఇక రాబోయే కాలంలో ప్రభుత్వం మీద ప్రతిపక్షాల విమర్శల దాడులు కూడా ఉధృతమవుతాయి. అయితే రాష్ట్ర స్థాయిలో వీటిని సమర్థవంతంగా తిప్పికొట్టగల నాయకులు చాలాతక్కువగా వున్నారు. ఇప్పటివరకు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడి హోదాలో సోమిరెడ్డి ఈ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ వచ్చారు. పదవి అనే ఇంధనాన్ని సోమిరెడ్డికి తగిలిస్తే మనిషి ఇంకొంచెం హుషారవుతాడు. ప్రతిపక్షాల మీద విరుచుకుపడడంలో హార్స్‌పవర్ పెంచుతాడు. అంతేకాదు, జిల్లాలో పార్టీ కార్యకర్తలకు అన్ని వేళల్లో అందుబాటులో వుండేది ఆయనే! కాబట్టి అటు ప్రభుత్వానికి ఉపయోగపడడంతో పాటు ఇటు జిల్లాలో పార్టీ కేడర్‌కు పెద్దదిక్కుగా ఉంటాడనే ఉద్దేశ్యంతోనే ఆయనకు ఎమ్మెల్సీ ఇవ్వడానికి సిద్ధపడ్డట్లు సమాచారం.






*పేకాట, డైమండ్‌డబ్బా, గుర్రపురేస్‌లు, సింగిల్ లాటరీలు... ఇప్పుడు క్రికెట్ క్రీడను కూడా వీటి సరసన చేర్చవచ్చు. క్రికెట్‌ను అందరూ ఒక క్రీడగా భావిస్తుంటే కొందరు మాత్రం దానిని జూదంగా మార్చారు. ఈరోజు క్రికెట్ అనేది ప్రపంచంలోనే ఓ పెద్ద మాఫియా జూదంగా మారింది. క్రికెట్ పందేలు వందలకోట్లలో జరుగుతున్నాయి. అది టెస్ట్ అయినా వన్డే అయినా ట్వంటీ ట్వంటీ అయినా... అది ఐపిఎల్ అయినా, హీరో కప్ అయినా, ఐసిసి వరల్డ్‌కప్ అయినా... పందేలా రాయుళ్లకు క్రికెట్ మ్యాచ్ జరుగుతుందంటే వారికి పెద్ద పండుగ క్రిందే లెఖ్ఖ.*

# పందెంరాయుళ్లకు పండుగ

ప్రస్తుతం వరల్డ్‌కప్ క్రికెట్‌పోటీలు జరుగుతున్నాయి. పందేల రాయుళ్లకు సంక్రాంతి, దీపావళి కంటే ఇదే పెద్ద పండుగ. వెయ్యి దగ్గర నుండి కోట్లలో పందేలు. వరల్డ్‌కప్‌లోనే అత్యంత ఆసక్తికరమైన భారత్-పాకిస్థాన్‌ల మ్యాచ్ ఆదివారం జరిగింది. ఈ ఒక్క మ్యాచ్ మీద నెల్లూరు జిల్లాలో కోట్ల రూపాయల పందేలు జరిగాయి. టాస్ దగ్గర నుండి చివరి వికెట్ దాకా పందేలు కాసారు. టాస్ ఎవరు గెలుస్తారు, మ్యాచ్ ఎవరు గెలుస్తారు అనే అంశాల మీదే కాకుండా ఎవరు సెంచరీ కొడతారు, ఏ ఓవర్‌లో ఎన్ని పరుగులు వస్తాయి, ఏ ఓవర్‌లో వికెట్ పడుతుంది, ఎన్ని పరుగులలోపు తేడాతో గెలుస్తారు... వంటి అనేక అంశాల మీద పందేలు జరిగాయి. మ్యాచ్‌లో ఎవరు గెలుస్తారనే దానిమీద కంటే కూడా పందెంరాయుళ్లు చివరి బంతి లేదా చివరి వికెట్ వరకు వచ్చే పరుగులు మీద పందేలు కాయడం విశేషం. ఈ వరల్డ్‌కప్ ముగిసేసరికి నెల్లూరులో చాలామంది పందేల రాయుళ్ల ఆస్తులు అమ్ముకోవడం ఖాయం. గత వరల్డ్‌కప్ అప్పుడు కూడా ఇలా పందేలు కాసి డబ్బులు పోగొట్టుకుని బ్రతుకుదెరువు కోసం బైక్ దొంగలుగా మారినవాళ్లు కూడా వున్నట్లు భోగట్టా!

# నెల్లూరు రోడ్లపై మొబైల్ హోటళ్లు



ప్రభుత్వ ఉద్యోగమే కావాలి, సాఫ్ట్‌వేర్ జాబ్ కావాలి, ఎవరో పనిచేస్తే మనం బ్రతకాలి అనే తీరును వదిలేసి చాలామంది తమ సొంత కాళ్ల మీద తాము నిలబడేందుకు ప్రయత్నిస్తున్నారు. వ్యాపారంలో కొత్త పంథాను అనుసరిస్తున్నారు. ఈ క్రమంలోనే నెల్లూరులోకి మొబైల్ హోటళ్లు ప్రవేశించాయి. సాధారణంగా బెంగుళూరు నగరంలో ఈ మొబైల్ హోటళ్లను ఎక్కువగా చూస్తుంటాం. ఒక పాత ఆటోను కొనుక్కోవడం, దాని ఆకృతిని కిచెన్‌గా మార్చుకోవడం... ఈ మొబైల్ బండిని జనసంచారం ఉండే ప్రాంతంలో కొంచెం ఖాళీగా వున్న ప్రాంతంలో నిలపడం, అక్కడే ఇడ్లీ, వడ, దోశె, బోండా, పూరీ వంటి వేడివేడి టిఫిన్ రెడీ చేస్తుంటారు. వివిధ పనుల మీద అదరా బదరా వెళ్లే వాళ్లు ఈ మొబైల్ హోటల్ వద్ద ఆగి టిఫిన్ లాగించేసి పోతుంటారు. అలాగే ఈ మొబైల్ హోటల్స్‌లోనే మధ్యాహ్నం, రాత్రి భోజనం కూడా వుంటుంది. బండి వద్దే నిలబడి తింటుంటారు. పెద్ద హోటళ్లలో ఆర్డర్ చేసిన అరగంటకు గాని ఐటమ్స్ రావు. ఇక్కడయితే అప్పటికప్పుడు ఆహారపదార్థాలు అందిస్తుంటారు. పెద్ద హోటళ్లతో పోలిస్తే రేట్లు తక్కువే! అందుకే ఈ మొబైల్ హోటళ్లకు క్రమక్రమంగా నెల్లూరు జనాలు అలవాటు పడుతున్నారు. ప్రస్తుతం నెల్లూరు మినీబైపాస్, ముత్తుకూరు రోడ్డు ప్రాంతంలో ఈ మొబైల్ హోటళ్లు కనిపిస్తున్నాయి. వీటి వ్యాపారం బాగుందనుకుంటే ఇవి కూడా కుప్పలు తెప్పలుగా వస్తాయి.

# రిచ్ హాస్పిటల్‌లో అరుదైన శస్త్ర చికిత్స

నెల్లూరు పొగతోటలోని రిచ్ హాస్పిటల్‌లో పురిటిబిడ్డకు అరుదైన శస్త్రచికిత్స చేసినట్లు డాక్టర్ రవికుమార్ తెలిపారు. ఆదివారం ఆసుపత్రిలో విలేకర్లతో మాట్లాడుతూ గత నెల 26న కావలిలో జన్మించిన మగబిడ్డకు పుట్టుకతోనే ఆయాసం, చేతులు కాళ్లు నీలంగా మారడం, నోటి నుంచి నురగ వచ్చిందన్నారు. ఆ బిడ్డను రిచ్ హాస్పిటల్‌కు తీసుకుని రాగా పరీక్షించి అన్నవాహిక లోపంతో ఉమ్మిని మింగలేకపోవడం, కడుపు భాగం ఊపిరితిత్తులకు కనెక్ట్ అయి ఉండటాన్ని గుర్తించామన్నారు. వెంటనే డాక్టర్ హజరత్, డాక్టర్ నారాయణస్వామి, డాక్టర్ నజీర్, డాక్టర్ ఇమ్రాన్, డాక్టర్ సురేష్‌బాబు, డాక్టర్ శివకుమార్‌లతో కలిసి కృత్రిమ అన్నవాహిక తయారు చేసి బిడ్డకు విజయవంతంగా అమర్చామన్నారు. బిడ్డ పూర్తిగా కోలుకున్నాడని, ఆదివారం డిశ్చార్జి చేసినట్లు తెలిపారు. శస్త్ర చికిత్సను ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా ఉచితంగా చేసినట్లు రవికుమార్ తెలిపారు.

# గీతామయిలో వస్త్రదానం



నెల్లూరు మాగుంట లేఅవుట్‌వాసి, ప్రముఖ బిల్డర్ మాగుంట శరత్‌చంద్రారెడ్డి తన వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని 14వ తేదీ నెల్లూరులోని గీతామయి వృద్ధాశ్రమంలో వృద్ధులకు వస్త్రదానం, అన్నదానం నిర్వహించారు. అలాగే తమ్మినేని కృష్ణయ్య మెమోరియల్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించబోయే శ్మశాన శకటానికి 50వేల రూపాయల విరాళాన్ని ఇస్తానని ప్రకటించారు. యువత చెడుమార్గాలకు అలవాటు పడకుండా మంచి సేవా కార్యక్రమాలతో సన్మార్గంలో నడవాలని ఈ సందర్భంగా శరత్‌చంద్రారెడ్డి సూచించారు.

# ఎండ... చలి

నెల్లూరుజిల్లాలో వాతావరణం అటు పూర్తి ఎండాకాలం కాకుండా, ఇటు పూర్తి చలికాలం కాకుండా ఉన్నట్లుంది. ఉదయం, రాత్రి వేళల్లో చలి ఉంటున్నందున ఇంకా ఏ.సిలు ఆన్‌చేసే పరిస్థితి రాలేదు. అలాగే పగలు కాసే ఎండ చురచురమంటుంది. శివరాత్రి పోయింది కాబట్టి ఇక ఎండలు పెరుగనున్నాయి. అసలే రాష్ట్ర ప్రభుత్వం కరెంట్ ఛార్జీలను పెంచింది. ఎండలు పెరిగితే ఏ.సి లు ఆన్ కాక తప్పదు. ఎండలతో పాటు కరెంట్ ఛార్జీలు కూడా ఈసారి మోత మోగించనున్నాయి.

# బాగుపడుతున్న రోడ్డు

నెల్లూరు నగరంలో ఆత్మకూరు బస్టాండ్ వద్ద ఫ్లైఓవర్ క్రింద వున్న అప్రోచ్‌రోడ్డు అధ్వాన్నంగా ఉండేది. ఈ రోడ్డుపైకి ఆక్రమణలు చొచ్చుకు రావడంతో ట్రాఫిక్ ఇబ్బందులుండేవి. ముఖ్యంగా ఆత్మకూరు బస్టాండ్‌లోకి వెళ్లే బస్సులు ఈ రోడ్డులోనే పోవాలి. ఇక్కడే పూలమార్కెట్ వుంది. ప్రతిరోజూ ఎంతో రద్దీగా వుంటుంది. గుంతలు పడి అధ్వాన్నంగా వున్న ఈ అప్రోచ్ రోడ్డును సిమెంట్‌రోడ్డుగా మారుస్తున్నారు. కొంతవరకు ట్రాఫిక్ సమస్యలు తగ్గినట్లే.

## 'పెళ్కూరు పట్టాభిరామిరెడ్డి ట్రస్ట్'

# సాంస్కృతిక కార్యక్రమాలు

శ్రీ పెళ్కూరు పట్టాభిరామిరెడ్డి స్మారక ఛారిటబుల్ ట్రస్ట్ సప్తమ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 20వ తేదీ నుండి 22వ తేదీ వరకు నెల్లూరు టౌన్‌హాల్లో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ పెళ్కూరు సుధాకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 20న రంగస్థల పద్యగాన పోటీలు, ఏకపాత్రాభినయం పోటీలు, లలిత సంగీతం, సినిమా పాటల పోటీలు నిర్వహిస్తామని, సాయంత్రం 'ప్రతిజ్ఞాపాలనము(కురుక్షేత్ర యుద్ధం)' పౌరాణిక పద్యనాటకాన్ని స్థానిక కళాకారులచే, హైదరాబాద్ సురభి వారి రంగాలంకరణతో నిర్వహిస్తున్నామన్నారు. 21వ తేదీ రాష్ట్ర స్థాయిలో శాస్త్రీయ సంగీత పోటీలు, సాయంత్రం 'గయోపాఖ్యానం' నాటక ప్రదర్శన, 22వ తేదీ రాష్ట్రస్థాయిలో శాస్త్రీయ నృత్యపోటీలు, సాయంత్రం బహుమతి ప్రదానోత్సవం జరుగుతాయన్నారు. అనంతరం శ్రీరామాంజనేయయుద్ధం(యుద్ధఘట్టం) ప్రదర్శిస్తామన్నారు. ఈ మూడురోజుల కార్యక్రమాల్లో భాగంగా వివిధ రంగాల్లో ఉత్తమ సేవలందించిన విశిష్ట వ్యక్తులకు సన్మానకార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో ట్రస్ట్ కన్వీనర్, ప్రముఖ రంగస్థల నటులు వల్లకవి వేంకట సుబ్బారావు, సర్వేపల్లి రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలే నిజమైన విలన్లు

వ్యక్తులు విలన్లు కాదని, సమాజంలోని సమస్యలే మనకు నిజమైన విలన్లని, వాటిపై మనం ఎదుర్కొని పోరాటం చేయాల్సిన అవసరముందని పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ కొలకలూరి ఇనాక్ పేర్కొన్నారు. నెల్లూరు ఐఎంఏ హాలులో ఆదివారం సాహితీమిత్రమండలి ఆధ్వర్యంలో డాక్టర్ ఈదూరు సుధాకర్ సారథ్యంలో ఇనాక్‌కు డాక్టర్ ఈదూరు సుబ్బయ్య సాహిత్య పురస్కారం ప్రదానం చేశారు. పురస్కారాన్ని అందుకున్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని అంశాలనే కథాంశాలుగా తీసుకుని గొప్ప రచనలను చేసే కలంగా మాత్రమే తాను ఉపయోగ పడ్డానన్నారు. సాహిత్యమే మానవ సంబంధాలకు మరింత బలాన్ని చేకూరుస్తుం దన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తెలుగుకథ ప్రపంచసాహిత్యంలో పోటీ పడగలిగిన అత్యంత శక్తి వంతమైన ప్రక్రియగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ జిఎం శివ నాయక్, సాహితీ మిత్రమండలి అధ్యక్షుడు డాక్టర్ ఈదూరు సుధాకర్, ప్రకాశంజిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు బి.హనుమా రెడ్డి, కవులు, రచయితలు సోమిరెడ్డి జయప్రద, చిన్ని నారాయణరావు, శేషయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం డాక్టర్ కొలకలూరి ఇనాక్‌ను సత్కరించి రూ. 10వేల నగదును అందజేశారు.

## నెల్లూరు కబుర్లు



# నెల్లూరులో ఇక 5 ఆటలు

నెల్లూరు నగరంలో వున్న ఎస్2 థియేటర్లను మల్టీప్లెక్స్‌గా మార్చుకోవడాన్ని అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉదయం 10 నుంచి అర్ధరాత్రి ఒంటిగంట వరకు ఒక్కో స్క్రీన్‌లో గరిష్టంగా అయిదు షోలను వేసుకునేందుకు అనుమతించినట్లు సమాచారం. అదేవిధంగా, ఆయా క్లాస్‌లను బట్టి, గోల్డ్, ఎలైట్, ఎకానమీ క్లాసుల్లో రూ. 130, రూ. 110, రూ. 60గా టిక్కెట్ల రేట్లను కూడా నిర్దేశించినట్లు హోంశాఖ ముఖ్య కార్యదర్శి నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు తెలుస్తోంది. గతంలో కూడా నెల్లూరులో అన్ని సినిమాహాళ్లలో ఐదు ఆటలు ప్రదర్శించేవారు. ఆ తర్వాత ప్రభుత్వం నాలుగు ఆటలకు కుదించింది. కొత్త సినిమాలు విడుదలైనప్పుడు ఈ నాలుగు షోల వల్ల టిక్కెట్లకు తన్నుకోవాల్సి వస్తుంది. ఇప్పుడు ఐదు షోలైతే అభిమానులకు టిక్కెట్ల బాధ కొంత తప్పే అవకాశముంది.

## చరిత్రను ప్రజలకు చేరువ చేయడమే

# చరిత్రకారుల లక్ష్యం

**- డా. కాళిదాసు పురుషోత్తం**



'సింహపురి సింహావలోకనం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ముఖ్యఅతిథులు

చరిత్రను ప్రజలకు చేరువ చేయడమే చరిత్రకారుల లక్ష్యమని, నాటి చరిత్రలను ప్రజలకు తెలియజేయడం ద్వారా ఆనాటి ప్రజల జీవన స్థితిగతులు అర్థమవుతాయని, జనజీవనానికి సంబంధించి చరిత్ర ఒక పునాదిరాయి వంటిదని ప్రముఖ చరిత్రకారుడు డాక్టర్ కాళిదాసు పురుషోత్తం అన్నారు. వ్యవసాయ శాఖ విశ్రాంత అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.వి రమణారెడ్డి రచించిన 'సింహపురి సీమ సింహావలోకనం' అనే పుస్తకాన్ని ఆదివారం నెల్లూరు టౌన్‌హాలులో ఆవిష్కరించారు. ఈ సభలో పాల్గొన్న డా. కాళిదాసు పురుషోత్తం మాట్లాడుతూ, చరిత్ర విషయాలన్నిటినీ సేకరించి, పరిశీలించి వాటిని అక్షరీకరించడమన్నది ఎంతో కష్టసాధ్యమైన పని అయినప్పటికీ, ఎం.వి రమణారెడ్డి ఎంతో కృషితో ఈ పుస్తకాన్ని రచించారని కొనియాడారు. ఈ పుస్తకాన్ని ఆవిష్కరించిన ప్రముఖ రచయిత పొనుగోటి కృష్ణారెడ్డి మాట్లాడుతూ, వ్యవసాయంపై ఎం.వి రమణారెడ్డి పలు పుస్తకాలు రచించి సేంద్రియ వ్యవసాయానికి రైతులు బాటలు వేసేవిధంగా కృషి చేశారని అభినందించారు. సభకు అధ్యక్షత వహించిన చిరసాని కోటిరెడ్డి ప్రసంగిస్తూ, ఎంవి రమణారెడ్డి సింహపురి సీమకు సంబంధించిన ఎన్నో విషయాలను సేకరించి అత్యద్భుతంగా ఈ పుస్తకాన్ని తీర్చిదిద్దారని, నాలుగు తరాల పాటు గుర్తుంచుకోదగిన గ్రంథంగా దీనిని రూపొందించి పాఠకులకు అందజేశారని అన్నారు. తెలుగుభాషోద్యమ సమితి నాయకుడు చలంచర్ల భాస్కరరెడ్డి, డాక్టర్ పెళ్కూరు జయప్రద, వ్యవసాయ శాస్త్రవేత్త డా. బి.పద్మోదయ, సింహపురి రైతు సంపాదకుడు వేమారెడ్డి నిరంజన్‌రెడ్డి, జి. మల్లికార్జునశాస్త్రి, అత్తులూరు వెంకటరమణయ్యానాయుడు, సర్వేపల్లి కోటేశ్వరరావు, రైతు డిపో సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీలో క్లీనింగ్ ప్రోగ్రామ్

ఉచ్చకంపుకు కేరాఫ్ అడ్రస్ నెల్లూరు ఆర్టీసీ బస్టాండ్. స్వచ్ఛభారత్ అనేది ఇక్కడ ప్రతిరోజూ, ప్రతి గంట కూడా అమలు చేయాల్సిన కార్యక్రమం. ఇక్కడ కంపును భరించలేకేమో ఆర్టీసీ ఆర్ఎం రవికుమార్ స్వయంగా సోమవారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అపరిశుభ్రంగా వున్న ప్రాంతాలను పరిశుభ్రంగా మార్చారు. ఆర్టీసీ కార్మికులతో పాటు బస్సులెక్కడానికి వచ్చిన ప్రయాణీకులు కూడా స్వచ్ఛభారత్‌లో తలోచెయ్యి వేస్తే బస్టాండ్ ప్రాంగణాలను శుభ్రంగా ఉంచుకోవచ్చునని ఈ సందర్భంగా ఆర్ఎం రవికుమార్ పేర్కొన్నారు. అలాగే పనిలోపనిగా ఆత్మకూరు బస్టాండ్‌లోనూ స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించి ఆరోజుకు కంపు లేకుండా చేశారు.

ఈ కార్యక్రమంలో సిటిఎం చంద్రశేఖర్, సిఎంఇ వెంకటశేషయ్య, డిఎం సుబ్రహ్మణ్యంలు కూడా పాల్గొన్నారు.

# అట్టహాసంగా జడ్పీ భవనం ప్రారంభం



నెల్లూరు పొదలకూరురోడ్డులోని క్షయ ఆసుపత్రి ప్రాంగణంలో ఎంతో అందంగా, ఆకర్షణీయంగా, అధునాతనంగా నిర్మించిన జిల్లా పరిషత్ నూతన కార్యాలయ భవనాన్ని ఈ నెల 14వ తేదీన రాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి పి.నారాయణ ప్రారంభించారు. జిల్లాలో మంచినీటి ఎద్దడి నివారణకు, ఇతర సమస్యల పరిష్కారానికి జిల్లా పరిషత్ పాలక వర్గానికి తమ పూర్తి సహకారం ఉంటుందని ఆయన ఈ సందర్భంగా చెప్పారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జిల్లా ప్రజాపరిషత్ అధ్యక్షులు బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ ఈ క్రొత్త భవనం 3ఎకరాల 66సెంట్ల విస్తీర్ణంలో వుందన్నారు. భవనం వైశాల్యం 34వేల చ.అ వుందని, దాదాపు రూ. 7కోట్లు ఖర్చయ్యిందన్నారు. ప్రతి మండలానికి ఒక కుట్టుమిషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి వాటిలో 10కుట్టుమిషన్‌లు ఇచ్చి మహిళలకు ఉచితంగా టైలరింగ్‌లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. నెల్లూరు పార్లమెంటుసభ్యులు మేకపాటి రాజమోహన్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా పరిషత్ భవనం అన్ని హంగులతో నిర్మించడం సంతోషకరమన్నారు. అదేవిధంగా జిల్లా పరిషత్ భవనాన్ని ఆనుకొనివున్న 26ఎకరాలలో అన్నీ ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తిరుపతి పార్లమెంటుసభ్యులు వి.వరప్రసాద్‌రావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో జిల్లా పరిషత్ అతి ముఖ్యమైన భాగమని, జిల్లా పరిషత్ ఛైర్మన్‌కు ప్రత్యేక అధికారాలున్నాయన్నారు. జిల్లా పరిషత్ భవనం సుందరంగా నిర్మించినందుకు ఆయన ఛైర్మన్‌ను అభినందించారు.

ఈ కార్యక్రమంలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్, సూళ్ళూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి గౌతమ్‌రెడ్డి, గూడూరు ఎమ్మెల్యే పి.సునీల్‌కుమార్, జాయింట్ కలెక్టర్ ఏఎండి ఇంతియాజ్, అదనపు జాయింట్‌కలెక్టర్ ఆర్.ఎస్.రాజ్‌కుమార్, జడ్పీ సిఇఓ జితేంద్ర, జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ వి.రామచంద్రారెడ్డి, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# రత్నం స్కూల్స్ సాంస్కృతిక సందడి



ఈ నెల 14 నుండి 19వ తేదీ వరకు నెల్లూరు నగరంలోని డా॥ కిషోర్స్ రత్నం స్కూల్స్ విద్యార్థుల వార్షికోత్సవ వేడుకలు మినీబైపాస్ రోడ్డులోని అనిల్ గార్డెన్స్‌లో ఘనంగా నిర్వహించారు. ఫిబ్రవరి 14వ తేదీ డా॥ కిషోర్స్ రత్నం హైస్కూల్ సరస్వతినగర్ ఒలింపియాడ్ బ్యాచ్, జూనియర్ ఒలింపియాడ్ బ్యాచ్, టెక్నో బ్యాచ్ విద్యార్థుల వార్షికోత్సవ వేడుకలు 'అద్వైత' పేరుతో నిర్వహించారు. అలాగే 15వ తేదీ రేస్ ఇంటర్నేషనల్ స్కూల్స్ విద్యార్థుల వార్షికోత్సవ వేడుకలు 'అభినయం' పేరుతో నిర్వహించగా 16వ తేదీ డా॥ కిషోర్స్ రత్నం ఫ్యూచర్‌విజన్ స్కూల్ మాగుంట లేఅవుట్ మరియు డా॥ సి.వి.రామన్ స్కూల్ విద్యార్థుల వార్షికోత్సవ వేడుకలు 'నవరంగ్' పేరుతో అందరినీ ఆకట్టుకున్నాయి. 18వ తేదీ డా॥ కిషోర్స్ రత్నం స్కూల్ వేదాయపాళెం మరియు నైస్ ఫౌండేషన్ స్కూల్, డైకాస్‌రోడ్డు విద్యార్థుల వార్షికోత్సవ వేడుకలు 'మకరందం' పేరుతో నిర్వహించగా, 19వ తేదీ "సింజిని" పేరుతో డా॥ కిషోర్స్ రత్నం స్కూల్ రిత్విక్ ఎన్‌క్లేవ్ మరియు శ్రీకృష్ణ దేవరాయ ఇంగ్లీషుమీడియం స్కూల్ గాయత్రినగర్ విద్యార్థులతో అతిరమణీయంగా నిర్వహించారు. ఈ నృత్యాలలో ముఖ్యంగా వెల్‌కం సాంగ్, చెన్నై ఎక్స్‌ప్రెస్, బృందావనికి గోవింద, గోపాల గోపాల, శివతాండవం, మహిషాసుర మర్దిని ఫోక్ డాన్స్ ఫ్రీడ్ సాంగ్ ఓలాల మొదలైన గీతాలకు విద్యార్థులు చేసిన నృత్యాభినయం అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి.

ఈ కార్యక్రమాలను డా॥ కిషోర్స్ రత్నం జెన్‌నెక్ట్స్ స్కూల్స్ డైరెక్టర్స్ డా॥ కృష్ణకిషోర్, వాసంతి కిషోర్‌ల పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డా॥ కిషోర్స్ రత్నం జెన్‌నెక్ట్స్ స్కూల్స్ జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, సీనియర్ మేనేజర్ రాజేష్‌బాబు, వివిధ స్కూల్ ప్రిన్సిపాల్స్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందితో పాటు విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఆనందోత్సాహాల మధ్య పాల్గొన్నారు.



# కల్యాణ వైభవం...!



రియాజ్‌హైదరాబాద్ లైటింగ్ హౌస్ అండ్ హైర్స్ అధినేత షేక్ రియాజ్‌బాషా - ఖుర్మూన్‌ల కుమారుడు అబిద్‌అలీ - ఆఫ్రిలా ల వివాహం ఫిబ్రవరి 15వ తేదీ నెల్లూరులోని కెజికె కల్యాణ మండపంలో ఘనంగా జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.



## చిన్ని నారాయణరావుకు 'జనరంజక కవి' ప్రతిభా పురస్కారం

ప్రముఖ కవి, 'మాట'-దీర్ఘకవితా కావ్యకర్త చిన్ని నారాయణ రావుకు ఎంతో ప్రతిష్టాత్మకమైన రావి రంగారావు సాహిత్యపీఠం పురస్కారం లభించింది. గుంటూరుకు చెందిన ఈ సాహిత్యపీఠం వారు జనరంజకమైన కవిత్వాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో జనరంజక కవి ప్రతిభా పురస్కారాల కోసం తమ రచనలను ఆహ్వానించగా, వచ్చిన 130 కవితల సంపుటాల్లో ఆరు వచన కవితా సంపుటాలకు, ఒక పాటల సంపుటికి ఈ విశిష్టమైన ప్రతిభా పురస్కారాలను ప్రకటించారు. వీటిలో నెల్లూరుకు చెందిన సుప్రసిద్ధ కవి చిన్ని నారాయణ రావు రచించిన 'మాట' దీర్ఘ కవితా కావ్యానికి 'జనరంజక కవి ప్రతిభా పురస్కారాన్ని' ప్రకటించారు. వచ్చే నెల 16వ తేదిన గుంటూరులోని బృందావన్ గార్డెన్స్‌లో శ్రీ వేంకటేశ్వర దేవాలయ ప్రాంగణంలోని అన్నమయ్య కళావేదికపై జరిగే సభలో ఈ పురస్కారాన్ని పురస్కార గ్రహీతలకు ప్రదానం చేస్తారని, రావి రంగారావు సాహిత్యపీఠం వారు తొలిసారి అందిస్తున్న ఈ 'సహజ కవి' పురస్కారాలు పొందిన కవులకు పురస్కారంతో పాటు రూ. 2వేల నగదు, శాలువా, జ్ఞాపికతో సత్కారం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. కాగా, చిన్ని నారాయణరావుకు ఈ విశిష్టమైన పురస్కారం లభించడం పట్ల నగరంలోని పలువురు కవులు, కవిత్వాభిమానులు ఆయనకు తమ శుభాభినందనలు తెలియజేశారు.

# సింహపురిపై ఎందుకీ కక్ష

**- పిసిసి అధ్యక్షుడు రఘువీరారెడ్డి**

కేంద్రంలో, రాష్ట్రంలో ప్రభుత్వాలను నడుపుతున్న బీజేపీ, తెలుగుదేశం పార్టీలు సింహపురికి ఒక్క సంస్థను కూడా ఎందుకు మంజూరు చేయలేదని, ఎన్నికలకు ముందు అనేక హామీలు ఇచ్చి, ఇప్పుడు మాట తప్పాయని ఎందుకీ కక్ష, పగ స్పష్టం చేయాలని పిసిసి రాష్ట్ర అధ్యక్షుడు రఘువీరారెడ్డి అన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన కోటిసంతకాల సేకరణ ఉద్యమం సోమవారం నెల్లూరులో జరిగింది. ఈ సందర్భంగా ట్రంకురోడ్డు ఏసి సెంటర్లో జరిగిన సభలో రఘువీరారెడ్డి మాట్లాడుతూ విభజన అనివార్యం అయిన సమయంలో రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ, చెన్నై - విశాఖపట్నంకు ప్రత్యేక కారిడార్ ఏర్పాటు, రాజధాని నిర్మాణానికి నిధుల మంజూరుకు పార్లమెంటు చట్టం చేసింది. పోలవరానికి జాతీయ హోదా, వైద్య, విద్యా, వైజ్ఞానిక సంస్థల ఏర్పాటుకు చట్టం చేసింది. అప్పుడు రాజ్యసభలో మాట్లాడిన వెంకయ్యనాయుడు ఐదేళ్ళ ప్రత్యేక హోదా కాదు, పదేళ్ళు కావాలని డిమాండ్ చేశారు. తమ ప్రభుత్వం వస్తే పదేళ్ళు హోదా ఇస్తామని గొప్పలు చెప్పారు. కాని అదే వెంకయ్యనాయుడు ఇప్పుడు సాధ్యం కాదని మాట మార్చారని అన్నారు. రైతులను, మహిళలను రుణమాఫీ పేరుతో చంద్రబాబు మోసగించారని ఘాటుగా విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఏఐసిసి నాయకులు తిరునావుక్కరుసు, కేంద్ర మాజీమంత్రి పనబాక లక్ష్మి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ధనుంజయరెడ్డి, కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఏసి సుబ్బారెడ్డి, పనబాక కృష్ణయ్య, ఆనం విజయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# స్టాండింగ్ ఎన్నికలకు పచ్చజెండా!

నెల్లూరు నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు బుధవారం నోటిఫికేషన్ వెలువడింది. నగరపాలక సంస్థ కమిషనర్ చక్రధర్‌బాబు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ నెల 26 నుండి 28వ తేదీ వరకు ఉదయం 11గంటల నుండి మధ్యాహ్నం 3గంటల దాకా నామినేషన్లు స్వీకరిస్తారు. మార్చి 1వ తేదీ ఉదయం 11గంటల నుండి మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్ల పరిశీలన ఉంటుంది. మార్చి 4న ఉదయం 11గంటల నుండి మధ్యాహ్నం 3గంటల దాకా నామినేషన్ల ఉపసంహరణ, మార్చి 9వ తేదీ ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు ఎన్నికలు నిర్వహిస్తారు. అదేరోజు 3గంటల నుండి కౌంటింగ్ నిర్వహించి ఫలితాలు వెల్లడిస్తారు. గత ఏడాది నవంబర్‌లోనే స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు కమిషనర్ నోటిఫికేషన్ విడుదల చేసారు. అయితే ఆరోజు మాకు తెలియకుండా నోటిఫికేషన్ ఇచ్చారంటూ మేయర్, మరికొందరు కార్పొరేటర్లు రాద్ధాంతం చేశారు. దీంతో అప్పట్లో స్టాండింగ్ కమిటీ ఎన్నికలను వాయిదా వేశారు. ఇప్పుడు గతంలో జరిగిన పొరపాట్లను సరిదిద్ది నోటిఫికేషన్ ఇచ్చారు. కార్పొరేషన్‌లో ఎవరి సత్తా ఏంటనేది స్టాండింగ్ కమిటి ఎన్నికల్లో తేలబోతోంది.

# గూడూరు డివిజన్ వార్తలు

## ప్రభుత్వ కళాశాలలపై దృష్టిసారించాలి


మంత్రి గంటా శ్రీనివాసరావును కలిసిన ఎమ్మెల్యే సునీల్

గూడూరు పట్టణం లోని ప్రభుత్వ కళాశాలల్లో వసతుల కల్పనకు దృష్టి సారించాలని మానవ వనరుల అభివృద్ధిశాఖా మంత్రి గంటా శ్రీనివాస రావును ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సోమ వారం హైదరాబాద్‌లోని సచివాలయంలో కలిసి విన్నవించారు. ఎస్‌కెఆర్ ప్రభుత్వ కళాశాలలో వసతిగృహం ఏర్పాటు చేయాలని, పాలిటెక్నిక్ కళాశాలలో వసతిగృహం, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. దీనిపై మంత్రి స్పందించినట్లు ఆయన తెలిపారు.

## లయన్స్ క్లబ్ బ్లడ్ క్యాంప్



గూడూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక పాలి టెక్నిక్ కళాశాలలో బుధ వారం పాలిటెక్నిక్ విద్యా ర్థులు, ఉపాధ్యాయులు, లయన్స్ క్లబ్ సభ్యులు మరియు కళాశాల ప్రిన్సి పాల్ వి.విజయ్‌కుమార్ సుమారు 100మంది దాకా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఏరియా ఆసుపత్రి డాక్టర్ కె.ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన హాజరయ్యారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తోట సురేష్‌నాయుడు, కార్యదర్శి నీలకంఠం నవీన్ జయకుమార్ మరియు లయన్స్ సభ్యులు కడివేటి చంద్రశేఖర్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## కష్టపడే వారికే ప్రాధాన్యం

### - టిడిపి ఇన్‌ఛార్జ్ జ్యోత్స్నలత



తెలుగుదేశంపార్టీలో కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు తగిన ప్రాధాన్యం ఉంటుందని గూడూరు తెలుగుదేశంపార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ బత్తల రాధాజ్యోత్స్నలత తెలిపారు. పట్టణంలోని రోడ్లు భవనాల అతిథిగృహంలో సోమవారం ప్రజల నుంచి పలు సమస్యలపై వినతులు స్వీకరించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నామినేటెడ్ పదవులైన మార్కెటింగ్, దేవాదాయ ఛైర్మెన్లకు ఎవరి పేర్లు ఖరారు చేయలేదన్నారు. ఈ నెల 26లోగా గ్రామ కమిటీల ఎన్నికలు ముగుస్తాయని, పలువురు రైతులు తమ సమస్యలను వివరించారు. పలుమార్లు అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయిం దన్నారు. వీటిని పరిష్కరించాలని కోరారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్క రించేలా చూస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రఘునాథరెడ్డి, గోను శివకుమార్, శ్రీనివాస్, విక్రమ్, నరసింహులనాయుడు, విజయ లక్ష్మి, సరళ, రజని, అంకయ్యనాయుడు నర్సారావులు తదితరులు పాల్గొన్నారు.



## రావిగుంటపాళెంరోడ్డు నిర్మించాలి

వాకాడు మండలం, శ్రీనివాసపురం, రావిగుంటపాళెంరోడ్డు అధ్వాన్నంగా ఉందని, దాన్ని నిర్మించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతూ ఆయా గ్రామాల ప్రజలు సోమవారం గూడూరులోని రోడ్లు భవనాల అతిథిగృహం కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ శ్రీనివాసపురం నుంచి రావిగుంటపాళెం మీదుగా దాదాపు 12కిమీ రోడ్డు దారుణంగా ఉందన్నారు. పులంజడిపాళెం నుంచి రావిగుంటపాళెం వరకు 8కి.మీ రోడ్డు ధ్వంసమైందని, దీంతో అత్యవసరాలకు 108వాహనం కూడా రావడం లేదన్నారు. గ్రామాల్లోని పిల్లలు పాఠశాలలకు వెళ్లాలన్నా ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. అధికారులు వెంటనే స్పందించి రోడ్డును నిర్మించాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు సుధాకర్, మూర్తి, సురేష్, విజయ, అరుణ్, సాయికుమార్, మునుస్వామి తదితరులు పాల్గొన్నారు.

## సౌత్‌జోన్ స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

గూడూరులో సౌత్‌జోన్ స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ మెన్స్ డబుల్స్ పోటీలు ఈ నెల 20, 21, 22తేదీలలో యేసుగ నరహరిరెడ్డి మున్సిపల్ పార్కులో నిర్వహిస్తున్నట్లు షటిల్ బ్యాడ్మింటన్ పోటీల గౌరవాధ్యక్షుడు మరియు తెలుగుదేశం నాయకుడు చేపూరు విజయమోహన్‌రెడ్డి తెలిపారు. ఈ పోటీలలో ఆంధ్రా, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొంటారన్నారు. ఆటల్లో గెలుపొందిన విజేతలకు షీల్డ్‌లతో పాటు మొదటి బహుమతి రూ.20,116/-లు, రెండవ బహుమతి రూ.15,116/-లు, మూడవ బహుమతి రూ.10,116/-లు, నాల్గవ బహుమతి రూ.7,516/-లు ఇస్తున్నట్లు, ప్రత్యేకంగా అత్యుత్తమ ప్రదర్శన కనపరిచిన క్రీడాకారులకు ప్రోత్సాహక బహుమతులు ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో షటిల్ బ్యాడ్మింటన్ అధ్యక్షుడు షేక్ జమాలుల్లా, ఆర్గనైజర్స్ సునీల్, పేటేటి వెంకటేశ్వర్లు, జి.గిరిబాబు, పాణి, దుర్గాప్రసాద్, షేక్ అబ్దుల్ కలాం, గవాస్కర్, రమేష్, షాహుల్ తదితరులు పాల్గొన్నారు.

# దేదీప్యమానం ... దక్షిణ కైలాసం

### అంగరంగ వైభవంగా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు



భక్తులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూసే మహాశివరాత్రి మంగళవారం తెల్లవారు జామున 2 గంటల నుంచి భక్తులకు దర్శనానికి అవకాశం కల్పించారు. శివభక్తులు ఈ రోజు కోసం కన్నులు కాయలుకాసేలా ఎదురు చూస్తారు. జన్మజన్మల పాపాలను తొలగించుకుని పుణ్యం పొందాలని ఆశిస్తారు. సాలిపురుగు, పాము, ఏనుగుకు ముక్తిని ప్రసాదించిన శివయ్య తమను కరుణించకపోతాడా అనే ఆశతో ఉంటారు. మూఢ భక్తుడైన తిన్నడి ద్వారా కన్నులు దానం చేయించుకుని కన్నప్పను చేసిన సదాశివుడి కటాక్షం కోసం తపిస్తారు. శ్రీకాళహస్తీశ్వ రాలయంలో బెంగుళూరు నుంచి తీసుకొచ్చిన పుష్పాలు, పలు రకాల పండ్లతో ఆలయంలో చూడ ముచ్చటగా అలంకరించారు. ఉదయం రాష్ట్ర అటవీ శాఖ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి దంపతులు ప్రభుత్వం తరపున స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలను సమర్పించారు. ఆలయంలో భక్తులకు సౌకర్యంగా క్యూ లైన్లను ఏర్పాటు చేశారు. ప్రత్యేక దర్శనానికి రూ.100 టిక్కెట్లు విక్రయించారు. లింగోద్భవ దర్శనానికి టిక్కెట్లు లేకుండా రద్దు చేశారు.

శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రాత్రి లింగోద్భవం మరో ప్రధాన ఘట్టం. విష ప్రభావంతో ఉన్న శివుడు తిరిగి మేల్కొనడాన్నే లింగోద్భవంగా పిలుస్తారు. మహాశివరాత్రి రోజు రాత్రి నందిసేవ వాహనంపై స్వామి ఊరేగింపుకు వెళ్ళి తిరిగి వచ్చే సమయానికి పూజారులు 10కాలాల అభిషేకాలు నిర్వహిస్తారు. లింగోద్భవాన్ని 11వ కాల అభిషేకంగా చేస్తారు. స్వామి అమ్మవార్లు బంగారు ఆభరణాలలో కళకళలాడారు.

మహాశివరాత్రి రోజున నంది - సింహ వాహన సేవల్లో స్వామి అమ్మవారికి బంగారు నగలను అలంకరించడానికి ఇ.ఓ. రామిరెడ్డి చర్యలు తీసుకు న్నారు. నాలుగేళ్ళ తర్వాత ఈసారి బ్రహ్మోత్స వాల్లో బంగారు కిరీటాలు, పాదాలు, కర్ణాలు, పెద్ద పెద్ద హారాలు, చేతి కడియాలు, స్వర్ణాభరణాలు భక్తులకు కనువిందు చేశాయి.

### వైభవంగా రథోత్సవం

అలాగే మహాశివరాత్రి మరుసటి రోజు బుధ వారం రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహిం చారు. చూడడానికి రెండు కళ్లు చాలవు అన్నట్లుగా స్వామి, అమ్మవార్ల రథాల్ని చూడముచ్చటగా అలంక రించారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన రథోత్సవం సాయంత్రం 5 గంటల దాకా జరిగింది. పురవీధుల్లో స్వామి, అమ్మవార్ల రథోత్సవం చూసిన భక్తులు పులకించిపోయారు. "హరహర మహాదేవ శంభోశంకరా " అంటూ భక్తులు రథాలను లాగి ఉప్పు, మిరియాలు రెండు రథాలపై చల్లి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం 11గంటలకు గంగా సమేతుడై తరలిరాగా జ్ఞానప్రసూనాంబ(పార్వతీదేవి), వినా యకుడు, చండికేశ్వరుడు, సుబ్రమణ్యం స్వామి తదితర పంచమూర్తులు ఉత్సవ మండపం నుంచి బయలు దేరారు. భిక్షాల గాలిగోపురం వద్ద ఉన్న రథంలో



## శ్రీకాళహస్తి న్యూస్

స్వామివారు, అమ్మవారి రథాలలో పంచమూర్తులు ఆశీనులైనారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బి.రామి రెడ్డి పురప్రముఖులు ఆశీనులైన స్వామివారి దర్శించు కున్నారు. వేదపండితులు మంత్రోచ్ఛారణతో సరిగ్గా 11.40నిమిషాలకు రథాలు ప్రయాణమయ్యాయి. పెద్ద ఎత్తున ప్రజలు స్వామివారిని, అమ్మవారి రథాలను లాగారు. తేరువీధి, నెహ్రూ వీధి, నగరి వీధి, బజారు వీధుల మీదుగా రథోత్సవం జరిగింది. సాయంత్రం బాబు అగ్రహారం కోనేరులో స్వామి, అమ్మవార్ల తెప్పోత్సవం కన్నులపండుగా నిర్వహించారు.

### కన్నులపండుగగా కళ్యాణోత్సవం

శ్రీకాళహస్తీశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం కళ్యాణోత్సవం కన్నులపండువగా నిర్వహించారు. స్వామి, అమ్మవారు కళ్యాణోత్సవం సందర్భంగా వందలాది మంది పెళ్ళిళ్ళు చేసుకు న్నారు. ఒకరకంగా చెప్పాలంటే ఇది పేదల కోసమే స్వామి, అమ్మవార్ల కళ్యాణోత్సవం నిర్వహిస్తారని అప్పటి ఆనవాయితీగా వస్తున్న పద్ధతిగా చెపుతున్నారు. పెండ్లిమండపం వద్ద స్వామి అమ్మవార్ల కళ్యాణోత్సవం నిర్వహించారు. వేదపండితుల మంత్రో చ్ఛారణ మధ్య కళ్యాణోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహ ణాధికారి బి.రామిరెడ్డి, ఆలయ ఇ.ఇ. రామిరెడ్డి, ఆలయ పి.ఆర్.ఓ. హరిబాబు, ఎపిఆర్‌ఓ నాగయ్యలు, ఆలయ సిబ్బంది, శ్రీకాళహస్తి తహశీల్దార్ చంద్ర మోహన్, మున్సిపల్ ఛైర్మన్ రాధారెడ్డి, శాప్ ఛైర్మన్ పి.ఆర్.మోహన్ తదితరులు పాల్గొన్నారు. డి.వై. ఎస్.పి. వెంకటకిషోర్ పర్యవేక్షణలో బ్రహ్మోత్సవాలకు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ఉద్యోగులకు విధి నిర్వహణలో సామర్ధ్యం బాగుండినా అధికారులను గమనించి పోవలసి వస్తుంది. శాస్త్ర సాంకేతిక రంగాల వారికి క్రొత్త ప్రాజెక్టులు, అవకాశాలు దొరకవచ్చును. వృత్తి వ్యాపారాలలో ఆటంకాలను, ఇబ్బందులను అధిగమిస్తారు. ఆర్ధిక స్థితి మెరుగై ఆదాయం పెరుగుతుంది. నగదు, విలువైన వస్తువులు జాగ్రత్త పరచుకొనండి.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

బాధ్యతాయుతమైన పదవులు అధికారాలు లభిస్తాయి. ఉద్యోగులకు అధికారుల సహకారం బాగుంటుంది. స్థలాలు ఇండ్ల కొనుగోలు పై దృష్టి పెడతారు. దూకుడుగా వ్యవహరించడం, మాట్లాడడం తగ్గించుకొనండి. చిన్నచిన్న సమస్యలు కుటుంబసభ్యులతో రావచ్చును. వృత్తి వ్యాపారాలలో మంచి అవకాశాలుండి ఆదాయం పెరుగుతుంది.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఆరోగ్యం, ఆహారం పట్ల శ్రద్ధ చూపండి. హామీలు, ప్రతివాదనలకు దూరంగా ఉండటం మంచిది. అనుకున్న పనులకు ఆటంకాలు కలిగి పునరాలోచనలతో నిర్ణయాలు మార్చుకుంటారు. ఆర్ధిక వ్యవహారాలను వాయిదా వేయడం మంచిది. ఆదాయవ్యయాలు సరిపోతుంటాయి. వృత్తివ్యాపారాలు ఒక మోస్తరుగా సాగుతాయి. రావలసిన బాకీలు నిలబడిపోతాయి.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

సామాజిక కార్యక్రమాలలో, సమావేశాలలో పాల్గొంటారు. బిడ్డల విద్యా ఉద్యోగ వివాహ విషయాలపై దృష్టి పెడతారు. భాగస్వామ్య వ్యాపారాలకు పెట్టుబడులకు అవకాశాలు దొరుకుతాయి. పొదుపు పథకాలపై నిర్ణయాలుంటాయి. వృత్తి వ్యాపారాలలో విశ్రాంతి దొరకదు. ఆదాయం బాగుంటుంది. స్థిరాస్తుల లావాదేవీలు వాయిదా పడటం మంచిది.



### బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

# రాశి – మీ వాసి

తేది. 20.02.2015 నుండి
తేది. 26.02.2015 వరకు

ఈ వారం మీనంలో కుజశుక్ర కేతువులు, మీన మేష వృషభ రాశులలో చంద్రుడు, కర్కాటకంలో గురువు, కన్యలో రాహువు, వృశ్చికంలో శని మకరంలో బుధుడు, కుంభంలో రవి సంచరిస్తారు.

**పంచాంగము:**

**ముహూర్తములు**

తేది 22 ఆదివారం ఉదయం గంట 3.22 నుండి గంట 5.28లోగా మకర లగ్నమున వివాహము.

**ఫాల్గుణ మాస శుక్లపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 20 | శుక్ర | విదియ | రా॥ గం.1.36వ॥ |
| తేది. 21 | శని | తదియ | రా॥గం.11.26వ॥ |
| తేది. 22 | ఆది | చతుర్ధి | రా॥గం.9.18వ॥ |
| తేది. 23 | సోమ | పంచమి | రా॥గం.7.22వ॥ |
| తేది. 24 | మంగళ | షష్ఠి | సా॥గం.5.22వ॥ |
| తేది. 25 | బుధ | సప్తమి | సా॥గం.4.28వ॥ |
| తేది. 26 | గురు | అష్టమి | సా॥గం.3.36వ॥ |

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

శుభకార్య ప్రయత్నాలు నిర్ణయం కాగలవు. బంధుమిత్రుల మాటలు కొద్ది మనస్తాపం కలిగిస్తాయి. వృత్తి వ్యాపారవృద్ధికి కొత్త ప్రణాళికలతో ముందుకు సాగుతారు. ఆదాయం పెరుగుతుంది. సమావేశాలలో మీ సూచనలు ఆమోదింపబడగలవు. కోర్టు కేసులందు అనుకూలత, రావలసిన బాకీలు కొంత లభించడం, అనుకున్న పనులను సాధించుకొనడం జరుగుతుంది.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

బంధుముఖ్యులకు అనారోగ్య బాధలు, కోర్టు కేసులు వాయిదా పడటం జరుగుతుంది. అనుకున్న పనులను జాగ్రత్తగా నిర్వహించినా చిన్నచిన్న ఇబ్బందులుంటాయి. ఉద్యోగులకు బాధ్యతల మార్పులు, అధికారులతో సఖ్యత బాగుంటుంది. నూతన వ్యాపారాలు పెట్టుబడుల మీద దృష్టి పెడతారు. ప్రభుత్వ అనుమతులు, ఋణాలు పొందుతారు. ఆదాయానికి తగ్గ ఖర్చులుంటాయి.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

పనులు, కార్యక్రమాలు హడావిడిగా జరుగుతాయి. స్థిరాస్తుల లావాదేవీలు జరపడం ఉండవచ్చును. అనుకోని ఖర్చుల వల్ల కొంత ఇబ్బందిపడతారు. వృత్తి పరంగా అభివృద్ధి ఆదాయం బాగుంటుంది. వ్యాపార వృద్ధికి అవకాశాలు అందివచ్చి రాబడి పెరుగగలదు. కుటుంబసభ్యులతో కొంత అభిప్రాయ భేదాలుండి సర్దుకుంటాయి. షేర్ల మీద స్వల్ప లాభాలుంటాయి.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

అనుకున్న పనులను పట్టుదలతో సాధించుకొంటారు. కుటుంబసభ్యులతో విభేదాలు రాకుండా సర్దుకొని పోవాలి. రాబడి, ఖర్చులు అంచనాలను రూపొందించుకొని ఆర్ధికస్థితిని బాగుచేసికొంటారు. ఆదాయం స్వల్పంగా పెరుగుతుంది. వృత్తి జీవనంలో వ్యాపకం బాగుంటుంది. కొత్త పెట్టుబడులు, వ్యాపార భాగస్వామ్యాలకు అవకాశాలు దొరుకుతాయి.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

గృహ మార్పులు, గృహ వస్తు వాహన రిపేర్లుండగలవు. నిర్మాణాలు చేపట్టిన వారికి వర్కర్లతో సమస్యలుండగలవు. ఆర్ధిక ఒప్పందాలలోను, చెల్లింపుల విషయంలో జాగ్రత్త పడండి. ఖర్చులు బాగా పెరుగుతాయి. ఋణాలు చేయవలసి రావచ్చును. పనులందు పట్టుదలకు పోకుండా చూసీ చూడనట్లుగా ఉండటం మంచిది. షేర్లు ఆశించిన రీతిలో లేకపోవడం జరుగుతుంది. ఆరోగ్య స్థితి బాగుంటుంది.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

నిర్మాణాలు చేపట్టడం, స్థిరాస్తుల లావాదేవీలు చేస్తారు. గృహ వస్తు వాహన రిపేర్లు జరుగగలవు. న్యాయ వ్యవహారాలలో ఇబ్బందులుండగలవు. ఆర్ధిక వ్యవహారాలలో ఆలోచన విధానము అవసరం. వ్యాపారవర్గాలకు అవకాశాలు తగ్గిపోవచ్చును. రాబడి అసంతృప్తిగా ఉంటుంది. ఇతరుల వల్ల మోసగింపబడటం గాని ఇబ్బంది పడటం గాని ఉండవచ్చును.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ఆర్ధికంగా బాగుంటుంది. కరెంటు, మిషన్లు, వాహనాలను రిపేర్లు చేసేవారు, వాహనాలు నడిపేవారు జాగ్రత్తగా ఉండాలి. క్రొత్త పెట్టుబడులకు ఆహ్వానాలు, క్రొత్త వ్యాపారాల ఆలోచనలుంటాయి. అనుకున్న పనుల మీద స్థిర నిర్ణయాలు తీసికొనలేక టెన్షన్ పడతారు. మొగమాటాలు పడి ఇబ్బందులు తెచ్చుకొనే అవకాశం ఉన్నది. స్థిరాస్తుల లావాదేవీలు వాయిదా వేసికొనండి.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ఉద్యోగులు పబ్లిక్‌తోను, అధికారులతోను జాగ్రత్తగా మెలగండి. కుటుంబసభ్యులతో కొంత చికాకులుంటాయి. ఆస్తి పంపకాలు, ఆస్తుల కొనుగోలు వాయిదా వేయండి. వృత్తి వ్యాపారాలలో క్రమంగా నిలబడతారు. ఆర్ధికంగా అవకాశాలు బాగుంటాయి. అనారోగ్య ఖర్చులు, పనులు జరుపుకొనేందుకు పెట్టే ఖర్చులు పైనబడినా ఆర్ధికంగా ఇబ్బందులుండవు. షేర్ల మీద స్వల్ప లాభాలుంటాయి.

# సాయిసింధుకు కన్నీటి వీడ్కోలు



నెల్లూరు చిన్నబజారు సవరాల వీధికి చెందిన సాయిసింధు అమెరికాలో వరకట్న దాహానికి బలైంది. సాయిసింధు మృత దేహం 14వ తేదీ రాత్రి అమెరికా నుంచి హైదరాబాదుకు చేరుకుంది. అక్కడి నుంచి అంబులెన్స్‌లో ఆదివారం ఉదయం నెల్లూరుకు తీసుకువచ్చారు.

కడసారి సాయిసింధును చూసిన తల్లిదండ్రులు, బంధువులు, కుటుంబ సభ్యులు కన్నీటివీడ్కోలు పలికారు. అమెరికాలోని కాలిఫోర్నియాలో హార్డ్‌వేర్ ఇంజనీరుగా పనిచేస్తున్న ఉదయ్‌కుమార్‌తో 2011లో వివాహం జరిగింది. ఈ నెల 6వ తేదీన ఆమె ఉరేసుకుని ఆత్మహత్యకు యత్నించి 10వ తేదీన ఆసుపత్రిలో మృతిచెందినట్లు భర్త ఉదయ్‌కుమార్ అత్తింటివారికి ఫోన్‌చేసి సమాచారం ఇచ్చాడు. ఆమెది ఆత్మహత్య కాదని, భర్తే హత్యచేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నాడని నెల్లూరుజిల్లా ఎస్పీకి సాయిసింధు తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో మూడవనగర పోలీసులు కేసు నమోదు చేసారు. సాయిసింధు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ తహశీల్దార్ జనార్ధన్‌రావు సమక్షంలో పోస్టుమార్టం జరిగింది. మూడవనగర ఇన్‌ఛార్జి సిఐ బాజీజాన్‌సైదా, ఎస్సై నాగేశ్వరరావు, ఆర్ఐలు నాసర్, గిరీష్, విఆర్ఓ గున్నయ్యలు కుటుంబసభ్యుల నుంచి వివరాలు సేకరించారు.

# ఋణమాఫీ ఫిర్యాదులు పరిశీలించాం

రైతుల రుణమాఫీ క్రింద 46వేల 723 మంది రైతులు అభ్యంతరాలు నమోదు చేసుకోగా, వాటిని మండలస్థాయి కమిటీలు పరిశీలించి వాటిలో 37వేల 770 అభ్యంతరాలు సక్రమంగా వున్నాయని తేలిందని లీడ్ బ్యాంక్ మేనేజర్ టి.వెంకటేశ్వరరావు వెల్లడించారు. ఆయన సమాచార పౌరసంబంధశాఖ రుణమాఫీ మరియు ఎన్‌టిఆర్ భరోసా తదితర కార్యక్రమాల గురించి ఏర్పాటు చేసిన చేజర్ల మండలానికి పోవు ప్రచార వాహనాన్ని జెండావూపి ప్రారంభించారు. ఈ సందర్భంగా లీడ్ బ్యాంక్ మేనేజర్ మాట్లాడుతూ అభ్యంతరాలు సక్రమంగా వున్నాయని తేల్చిన 37వేల 770 ఫిర్యాదులు సంబంధిత బ్యాంకు ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి పంపిస్తున్నట్లు తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రుణమాఫీ గురించి మాట్లాడుతూ మొదటివిడతగా 1లక్షా 84వేల 995మంది రైతులకు ప్రభుత్వం 678కోట్లు మంజూరు చేయగా వాటిలో 206కోట్ల నిధులు విడుదల చేసినట్లు తెలియజేశారు. 2వ జాబితా కింద జిల్లాలో 1లక్షా 84వేల 731మంది రైతులను గుర్తించి, వారి ఆధార్, రేషన్‌కార్డులను సేకరించడం జరిగిందని, వాటిని ప్రభుత్వానికి పంపిస్తున్నట్లు లీడ్ బ్యాంక్ మేనేజర్ తెలియజేశారు.

# ఆదర్శ గ్రామాల అభివృద్ధికి సహకారం

**కర్ణాటక ప్రభుత్వ తెలుగు ఉద్యోగుల సంఘం అధినేత ఎల్.నాగేశ్వర్‌రావు**

గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శగ్రామాలుగా తీర్చిదిద్దడంలో తమ వంతు సహకారం అందిస్తామని "కర్ణాటక ప్రభుత్వ రంగ తెలుగు ఉద్యోగుల సమన్వయ సమితి" ఎల్.నాగేశ్వరరావు పేర్కొన్నారు. నెల్లూరు ప్రిన్స్ హోటల్‌లో 14వ తేదీ అక్షయ సింహపురి సేవాట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్ణాటకలో 2 కోట్లకు పైగా తెలుగు ప్రజలు ఉన్నారని, అదేవిధంగా పెద్ద సంఖ్యలో తెలుగు ఉద్యోగులు పనిచేస్తున్నారని చెప్పారు. తెలుగు ఉద్యోగులు, ప్రజలకోసం ఉద్యోగుల సమన్వయ సమితి అనేక సంక్షేమ సేవా కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ఈ సమన్వయ సమితిని గత రెండేళ్ల క్రితం అప్పటి కేంద్రమంత్రి జె.డి.శీలం ప్రారంభించారన్నారు. అప్పటి నుంచి నేటి వరకు తెలుగు భాషా సంస్కృతి, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తున్నామన్నారు. తన సొంత జిల్లా అయిన సంగం మండలంలోని వెంగారెడ్డిపాళెం గ్రామాన్ని స్మార్టు విలేజ్‌గా అభివృద్ధి చేయడంలో సింహపురి సేవాట్రస్టుకు తమవంతు సహకారం అందిస్తామని, అందరిని అభివృద్ధిలో భాగస్వామ్యులు చేస్తామన్నారు. తాము గత శుక్రవారం క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఎం.జానకిని కలిసి ఆదర్శ గ్రామాల అభివృద్ధిలో తామూ భాగస్వామ్యులవుతామని చెప్పడం జరిగిందన్నారు. సంగం జడ్పీటిసి సభ్యులు దేవసహాయం మాట్లాడుతూ కర్ణాటక ప్రభుత్వ రంగ ఉద్యోగుల సమన్వయ సమితి వెంగారెడ్డిపాళెం గ్రామాభివృద్ధిలో భాగప్వామ్యులు కావడాన్ని అభినందించారు.

మండలాధ్యక్షురాలు డి.కామాక్షమ్మ మాట్లాడుతూ తమ మండలంలోని గ్రామాల అభివృద్ధికి కర్ణాటక తెలుగు ఉద్యోగుల, ప్రజల సహకారం కావాలన్నారు. ట్రస్టు కార్యదర్శి సుధాకరరెడ్డి మాట్టాడుతూ వెంగారెడ్డిపాళెం గ్రామాభివృద్ధిలో పాలుపంచుకునేందుకు నాగేశ్వరరావు ముందుకు రావడం పట్ల అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ట్రస్టు సభ్యులు నాగేశ్వరరావును దుశ్శాలువాతో నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు యూనియన్ నాయకులు వి.రామచంద్రమూర్తి, సర్పంచుల సంఘం నాయకులు కె.వెంకటేశ్వరరెడ్డి, సర్పంచులు కె.విజయలక్ష్మి, రాజానాయుడు, ఎంపిటిసిలు రంగయ్య, మద్రి రమాదేవి, మండల వైకాపా నాయకులు డి. మదుసూదన్‌రెడ్డి, బుడిగి రమణారెడ్డి, కమతం రామకృష్ణారెడ్డి, ట్రస్టు సభ్యులు పి.ప్రమీలమ్మ తదితరులు పాల్గొనారు.

# భారత్ గెలుపుపై సంబరాలు



క్రికెట్ ప్రపంచ కప్‌లో భాగంగా భారత్ – పాకిస్థాన్ మధ్య ఆదివారం జరిగిన మ్యాచ్‌లో భారత్ గెలుపొందడంపై నెల్లూరులో యువత సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ముస్లిం సేవాకమిటి అధ్యక్షుడు షేక్ ఖాలీద్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ముస్లిం యువతకు, దుకాణదారులకు పంచిపెట్టి కేరింతలు కొట్టారు. ఖాలీద్ మాట్లాడుతూ తమ చిరకాల ప్రత్యర్థి అయిన పాకిస్థాన్‌పై భారత్ ఘనవిజయం సాధించిందని, అలాగే మిగిలిన మ్యాచ్‌లను గెలిచి భారత్‌కు మూడో వరల్డ్‌కప్ తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు షేక్ మున్వర్, మున్నా, తౌసిప్, అన్వర్, షఫీ, సందాని తదితరులు పాల్గొన్నారు.

# సైకత శివయ్యకు పూజలు



ఈ నెల 17వ తేదీన మహాశివ రాత్రిని పురస్కరించుకుని పినాకిని స్విమ్మర్స్ అసోసియేషన్ వారు పెన్నానదిలో సైకత శివలింగాన్ని ఏర్పాటు చేశారు. పాలు, తేనె, నెయ్యి, చందనం, విభూది, పంచామృతాలతో సైకత శివలింగానికి అభిషేకం, పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు అలంకార్ పెంచలయ్య, కార్యదర్శి శరత్‌చంద్ర, కార్పొరేటర్లు పి.రూప్‌కుమార్‌యాదవ్, నూనె మల్లిఖార్జునయాదవ్, ఇంకా ఎం.నాగేశ్వరరావు, జె.ఎల్.సత్యం, డి.మునీంద్ర, పుల్లారెడ్డి, గోపాలకృష్ణ, శేషుబాబు, మల్లిఖార్జునరావు, నాగేంద్ర, బుజ్జయ్య, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. పినాకిని స్విమ్మర్స్ అసోసియేషన్ వాళ్ళ ప్రతిఏటా శివరాత్రి రోజు ఇలా సైకత శివలింగాన్ని ఏర్పాటు చేసి పూజలు నిర్వహించే సంప్రదాయాన్ని కొనసాగిస్తుండడం విశేషం.

# స్మగ్లర్ అప్పు మృతి

పేరుమోసిన ఎర్రచందనం స్మగ్లర్ గోపాలస్వామి అలియాస్ అప్పు సోమవారం కాకినాడలో మృతిచెందాడు. ఎర్రచందనం స్మగ్లింగ్‌కు సంబంధించి చిత్తూరు, కడప, నెల్లూరుజిల్లాల్లో ఇతనిపై కేసులున్నాయి. ఎన్నికల నకిలీమద్యం కేసులో అప్పు ప్రధాన నిందితుడు. ఇటీవల నెల్లూరుజైలులోనే అప్పు కొంతకాలం ఉండడం తెలిసిందే! క్యాన్సర్ వ్యాధితో ఆయన మృతి చెందాడు.

# మళ్ళీ షాక్...

(మొదటిపేజీ తరువాయి)

తిట్టలేక లోలోపలే తిట్టుకుంటున్నారు. మరి వీరందరినీ రాష్ట్ర ప్రభుత్వం అరెస్ట్ చేసి జైలులో పెట్టగలదా? ఒకసారి ఎన్నికలకు ముందు తెలుగుదేశంపార్టీ ప్రచార ప్రకటనను పరిశీలిద్దాం. జాబు కావాలంటే బాబు రావాలి... అనేది ఓ స్లోగన్. బాబు వచ్చినా రాష్ట్రంలో జాబులు లేకుండా పోయాయి. ఇక రైతు, డ్వాక్రా, బంగారు ఋణాల మాఫీ గురించిన ప్రకటనలైతే చెప్పనవసరం లేదు. ఏ నిముషంలో ఏ టీవీ ఛానెల్ ఆన్ చేసినా అప్పులు కట్టమని బ్యాంకు అధికారులొచ్చి ఓ మహిళ మెడలో పుస్తెలు తెంచబోతే ఆయనొస్తున్నాడు అంటూ చంద్రబాబు ముఖం కనిపించేది. నిజంగానే చంద్రబాబు వచ్చాడు. రైతులకు ఋణమాఫీ జరుగుతుందో లేదో వారికే అర్థం కావడం లేదు. ఆరోజు మాత్రం అన్ని రకాల ఋణమాఫీ అన్నారు. ఇప్పుడు మాత్రం బంగారు, డ్వాక్రా మహిళల ఋణాలపై మాట తప్పారు.

చంద్రబాబు వచ్చాడంటే ఇవన్నీ జరుగుతాయో లేదోకాని కొన్ని మాత్రం ఖచ్చితంగా జరుగుతాయి. అవి కోతలు, వాతలు, ఛార్జీల మోతలు. ఇప్పటికే వివిధ సంక్షేమ పథకాలకు, సబ్సిడీలకు కోతలు పడ్డాయి. దేశంలో పెట్రోల్ ధరలు బాగా తగ్గుతున్నా చంద్రబాబు మాత్రం లీటర్ పెట్రోల్ మీద 4రూపాయలు వ్యాట్‌టాక్స్ పెంచి ప్రజలకు వాతలు పెట్టాడు. ఇక చంద్రబాబు వస్తే సెంటిమెంట్‌గా జరిగే కార్యక్రమం కరెంట్ ఛార్జీలను పెంచడం. ఏప్రిల్ నుండి విద్యుత్ ఛార్జీలు వినియోగదారుల వీపును విమానం మోత మోగించనున్నాయి. వంద యూనిట్లు వాడుకునే వారికి కొంత వెసులుబాటు. నెలకు వంద యూనిట్లు దాటి వాడుకుంటే మాత్రం కరెంట్ బిల్లు చూసి షాక్ తినాల్సిందే! ఇప్పుడు వంద యూనిట్లలోపు వాడకం అనేది గుడిసెల్లో ఉండే వాళ్ళకు కూడా సాధ్యమయ్యే పనికాదు. ఇప్పుడు ఇంట్లో ప్రతి వస్తువుకు కరెంట్‌తో సంబంధం ఏర్పడింది. గృహస్థులు ఆ అలవాటును మానుకోలేరు. ముఖ్యంగా వచ్చేది ఎండాకాలం. ఏసిలు, కూలర్‌లు, ఫ్రిజ్‌లు 24గంటలు ఆన్‌లో ఉండాల్సిందే! ఏ.సి వేసుకున్నప్పుడు చల్లగానే ఉంటుంది. బిల్లు వచ్చినప్పుడే అగ్నిగుండంలో దూకినట్లవుతుంది. చంద్రబాబు సింగపూర్ రాజధాని కట్టాలంటున్నాడు. ఆకాశహర్మ్యాలు నిర్మించాలంటున్నాడు. స్పెషల్ ఫ్లైట్లు వేసుకుని విదేశాలకు తిరుగుతున్నాడు. ఉద్యోగులకు ఆడంబరంగా 43శాతం ఫిట్‌మెంట్ ఇచ్చాడు. పైన కేంద్రం మాత్రం రాష్ట్రానికి రూపాయి కూడా ఇవ్వనంటుంది. మరి చంద్రబాబు ఈ దాబుసరి పనులు చేయాలంటే సామాన్య జనం సమిధలు కావాల్సిందే!

# మీడియా రక్ష!

(మొదటిపేజీ తరువాయి)

అధ్యక్షుడే కాకుండా సాక్షి టి.వి మరియు సాక్షి పత్రికలకు యజమాని కూడా కావడంతో "జగన్"ని ఒక రాజకీయ నాయకుడిగా కాకుండా సాటి మీడియా వ్యక్తిగా మిగిలిన ఛానళ్ళు, పత్రికలు భావించడంతో మొత్తం ప్రచార సాధనాలన్నీ చంద్రబాబు భజన చేస్తున్నాయి.

వాస్తవమైన పరిస్థితులను వివరిస్తూ జగన్ స్పష్టమైన ఆరోపణలు చేస్తున్నా వాటిని ప్రజలకు చూపించే సాధనమే కరువైపోయింది. జగన్ 'సాక్షి' పత్రిక, ఛానెల్ ఒక్కటే ప్రభుత్వంపై విరుచుకు పడుతుంది. అయితే అవి జగన్‌కు సంబంధించిన మీడియా సంస్థలు కావడంతో వాటిల్లో నిజాలు వచ్చినా ప్రజలు నమ్మే పరిస్థితి లేకుండాపోయింది. రాష్ట్రంలో మిగిలిన ప్రాధాన్యత కల మీడియా అంతా చంద్రబాబు సర్కార్‌కే గొడుగు పడుతున్నాయి. ఈ 8నెలల కాలంలో చంద్రబాబు ప్రభుత్వం అద్భుతాలేమీ చేయలేదు. పరిపాలన గొప్పగా చేస్తున్నది కూడా లేదు. అవినీతి గతం కంటే ఘనంగా రాజ్యమేలుతోంది. అక్రమాలు, దౌర్జన్యాలు పెరిగాయి. అధికారిక విధుల్లో రాజకీయ జోక్యం పెరిగింది. పైసా ఆదాయం లేకున్నా అద్భుత రాజధాని కోసం అధ్యయనాలంటూ చంద్రబాబు ప్రత్యేక విమానం వేసుకుని తిరుగుతూ కోట్లు తగలేస్తున్నాడు. మీడియాకు సమస్యలు కనిపించడం లేదు. ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను పట్టించుకోవడం లేదు. చంద్రబాబును కాపాడడానికి ప్రధాన దినపత్రికలే కొన్నేసి కథనాలను సృష్టిస్తున్నాయి. మినీ జపాన్, మినీ సింగపూర్ అంటూ సాధ్యం కాని, ఆచరణలోకి రాని అరచేతి వైకుంఠాలను అక్షరాలలో చూపిస్తూ... ప్రజలను బురిడీ కొట్టిస్తున్నారు. రాజధాని పేరుతో తరతరాలకు ఆహార ధాన్యాలను, వ్యవసాయ ఉత్పత్తులను అందించే వేల ఎకరాల పచ్చటి పంట పొలాలను చంద్రబాబు తగలబెడుతుంటే ఇదేమి పనంటూ మీడియా ప్రశ్నించలేకపోతోంది. ఈరోజు పత్రికలు గాని, టీవీ ఛానెళ్ళు గాని స్వాతంత్ర సమరయోధుల, అరివీర భయంకర దేశ భక్తుల చేతుల్లో లేవు. వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు, రాజకీయ నేతల చేతుల్లో ఉన్నాయి. వీళ్లకు ప్రత్యేక ఆసక్తులు ఉంటాయి. పార్టీల పట్ల అభిమానాలుంటాయి. అయితే ఎన్నికల సమయంలో వాటిని ప్రదర్శించుకుంటే సరే... ఇలా తప్పటడుగులు వేస్తున్న ప్రభుత్వాలను కూడా సమర్థించుకుంటూ పోతే మనం వారికి మంచి చేస్తున్నట్లు కాదు, భవిష్యత్‌లో కీడు చేస్తున్నట్లు! మీడియా పార్టీలకు మరీ భాజాభజంత్రీగా ఉండనవసరం లేదు. కనీసం తప్పులను ఎత్తి చూపే బాధ్యతనైనా నిష్పక్షపాతంగా నిర్వర్తించకపోతే ఎలా?

# మహానిర్మాత.. మనకిక లేరు

(మొదటిపేజీ తరువాయి)

ఆయన మరణంతో సినీరంగం శోక సంద్రమే అయింది. ప్రత్యేకించి తెలుగు ప్రజలు ఆయన మరణవార్తతో శోకతప్త హృదయులయ్యారు. తెలుగుతో పాటు, హిందీ, తమిళం, కన్నడం, బెంగాలీ తదితర భాషల్లోనూ ఎన్నో అమోఘమైన చిత్రాలను నిర్మించి సినీజగత్తులో తెలుగువాడి సత్తాను చూపించారు. 13 భాషల్లో 140కి పైగా ఆణిముత్యాల్లాంటి చిత్రాలను తీసి, ప్రపంచంలోనే అత్యధిక చిత్రాలు నిర్మించిన నిర్మాతగా ఆయన గిన్నిస్‌బుక్ రికార్డు సాధించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి పొందిన అసాధారణ నిర్మాత దగ్గుబాటి రామానాయుడు గారు. ఆయన మృతితో తెలుగు సినీరంగమే కాదు...తెలుగు ప్రజలందరూ విషాదంలో మునిగిపోయారు.

శతాధిక చిత్రాల నిర్మాతగా ప్రఖ్యాతిగాంచిన ప్రముఖ నిర్మాత డి.రామానాయుడు స్వస్థలం ప్రకాశం జిల్లాలోని కారంచేడు గ్రామం. 1936 జూన్ 6న ఆయన జన్మించారు. సినీరంగంలో ప్రవేశించాక, సురేష్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై అద్భుతమైన ప్రేమకథా చిత్రాలను, కుటుంబ కథా చిత్రాలను రూపొందించడంలో తనకు తానే సాటి అనిపించుకున్నారు. 1963లో "అనురాగాలు" సినిమాకి సహనిర్మాతగా వ్యవహరించినా... 1964లో 'రాముడు భీముడు'లో ఎన్టీ రామారావు ద్విపాత్రాభినయం చేసిన సినిమాతో పూర్తిస్థాయి నిర్మాతగా సినీరంగంలో ప్రవేశించి, శ్రీకృష్ణ తులాభారం, సిపాయి చిన్నయ్య, ప్రేమనగర్, జీవన తరంగాలు, చక్రవాకం, సోగ్గాడు, సెక్రటరీ, ప్రేమమందిరం, దేవత, కలియుగ పాండవులు, బ్రహ్మపుత్రుడు, బొబ్బిలిరాజా, కలిసుందాం... రా, నువ్వు లేక నేను లేను.. వంటి ఎన్నో సకల జనరంజకమైన చిత్రాలను నిర్మించారు. ప్రేమనగర్ చిత్రం సూపర్‌హిట్ కావడంతో చిత్రరంగంలో ఆయన స్థానం మరింత దేదీప్యమానమైంది. ప్రేమనగర్ చిత్రం ఆయన సినీరంగ జీవితానికి బలమైన పునాది వేసింది. 1994లో 'ఆంధ్ర వైభవం' చిత్రానికి రాష్ట్ర ప్రభుత్వం 'ఉత్తమ నిర్మాత'గా ఆయనకు పురస్కారం అందించి ఘనంగా సత్కరించింది. బెంగాల్‌భాషలో నిర్మించిన 'అశాక్' చిత్రం ఉత్తమ జాతీయ చిత్రంగా అవార్డును అందుకుంది. 2001లో నిర్మించిన 'ప్రేమించు' చిత్రానికి అయిదు నంది అవార్డులతో పాటు, రాష్ట్రపతి ప్రశంసలను కూడా అందుకుంది. సినీరంగంలో అద్భుతాలు సృష్టిస్తూ, నిర్మాతగా ఎనలేని ఖ్యాతినిగన్న డి.రామానాయుడుకు శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం వారు గౌరవ డాక్టరేట్‌ను బహూకరించారు. ఎంతో ప్రతిష్టాత్మకమైన రఘుపతి వెంకయ్య అవార్డుతో పాటు, దాదా సాహెబ్ ఫాల్కే వంటి విశిష్టమైన అవార్డులను కూడా అందుకున్న ఘనత ఆయనది. సినీరంగంలో ఆయన చేస్తున్న కృషికి, సామాజిక రంగంలోనూ ఆయన సేవలకు గుర్తింపుగా 2013లో భారత ప్రభుత్వం 'పద్మభూషణ్' అవార్డుతో సత్కరించింది. దాదాపు అయిదున్నర దశాబ్దాలుగా సినీరంగంలో వుంటూ, చిత్రపరిశ్రమే జీవితంగా, జీవితమే పరిశ్రమగా అంచలంచలుగా ఎదుగుతూ, ఎన్నో మహోన్నత చిత్రాలను నిర్మించి ప్రేక్షకుల గుండెల్లో చిరస్మరణీయమైన ముద్రను వేసుకున్నారాయన. హైదరాబాద్‌లో రామానాయుడు స్టూడియోస్‌ను స్థాపించి ఎంతోమందికి ఉపాధి కల్పించారు. ఎంతో మంది కొత్తవారిని వెండితెరకు పరిచయం చేశారు. అనేక మంది నటీనటులను, దర్శకులను, సాంకేతిక నిపుణులను వెండితెరకు పరిచయం చేసిన ప్రఖ్యాత నిర్మాత నాయుడు గారు. ఆయన స్థాపించిన సురేష్ ప్రొడక్షన్స్‌లో సుమారు నూరుమందికి పైగానే నాయకులు, 130 మంది దాకా కథానాయికలు నటించారంటే ఆయన చిత్రరంగంలో ఎంతటి విశేషఖ్యాతిని పొందారో అర్థమవుతుంది. అదేవిధంగా రాజకీయరంగంలోనూ రాణించారు. చిత్రరంగంలో అగ్రశ్రేణి నిర్మాతగా వుంటూనే 1999లో బాపట్ల నియోజకవర్గం నుంచి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి యం.పి.గా విజయం సాధించారు. పార్లమెంటు సభ్యుడిగా కోట్ల రూపాయలు తన స్వంత నిధులను ఖర్చు చేసి ప్రజలకు సేవలందించిన ఘనుడాయన. అటు రాజకీయరంగంలోనూ ఇటు తెలుగు సినీరంగంలోనూ ఆయనెంతో ఖ్యాతిని పొందారు. తెలుగు సినిమా కీర్తిని, ప్రతిభాపాటవాలను దశదిశలా మార్మోగించిన మహా నిర్మాత రామానాయుడుగారు.

ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు వున్నారు. పెద్దకుమారుడు డి. సురేష్‌బాబు కూడా ప్రముఖ నిర్మాత కాగా, చిన్న కుమారుడు వెంకటేష్ సినీహీరోగా ప్రఖ్యాతి చెందారు. రామానాయుడుగారి మరణవార్త విన్నంతనే ప్రధాని నరేంద్రమోడీ, కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, గవర్నర్ నరసింహన్ తదితర ప్రముఖులంతా దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని ప్రకటించారు. చివరిసారిగా ఆయన భౌతిక కాయాన్ని సందర్శించుకునేందుకు చిత్రపరిశ్రమే కదిలివచ్చింది.. ఎంతో మంది నటీనటులు, దర్శకులు, ప్రముఖులు వేలాదిగా తరలివచ్చి ఆయనను కడసారి దర్శించుకుని కన్నీటితో వీడ్కోలు పలికారు.

బహుభాషా చిత్రాల నిర్మాతగా, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీతగా, గిన్నీస్‌బుక్‌లో పేరు సాధించిన అగ్రశ్రేణి నిర్మాతగా, సామాజిక సేవలోనూ, రాజకీయరంగంలోనూ రాణించిన మహోన్నత వ్యక్తిగా రామానాయుడు ప్రజల మనసుల్లో చిరస్మరణీయమైన స్థానాన్ని సాధించుకున్నారు. ప్రత్యేకించి, ప్రతి తెలుగువాడు గర్వించేవిధంగా, సినీరంగంలో ఎంతో ఉన్నతస్థానానికి ఎదిగి, అటు సినీరంగానికి, ఇటు సమాజానికీ విశేష సేవలందించిన మార్గదర్శకుడు.. మహోన్నత మానవీయమూర్తి రామానాయుడుగారి అస్తమయం.. సినిమారంగంలోని వారికే కాదు, తెలుగు ప్రజానీకానికంతటికీ తీరని విషాదాన్ని మిగిల్చింది.

## హెచ్చరిక నోటీసు

నా క్లైంటు శ్రీ పోలంరెడ్డి వేణుగోపాలరెడ్డి S/o ఈశ్వర్‌రెడ్డి, చెన్నై గారి సంజాయిషీ మేరకు యావన్మందికి తెలియజేయుటేమనగా నా క్లైంటు ఈ క్రింది షెడ్యూల్ దాఖల ఆస్థిపై మద్దాలి వెంకటరమణారెడ్డి, మొలకల ముద్దుకృష్ణారెడ్డి మరియు ఇతరులపై ఏ.పి. హైకోర్టులో ASNo.248/2D10గా వాజ్యం నడుపుచున్నాడు. మరియు సదరు కోర్టు వారు ఈ షెడ్యూలు దాఖల ఆస్తులను ఇతరులకు అన్యాక్రాంతం చేయకుండా ASMP No.699/2010లో ఇంజక్షన్ ఉత్తర్వులు మంజూరు చేసివున్నారు. సదరు విషయాలను మభ్యపెట్టి సదరు యం.ముద్దుకృష్ణారెడ్డి, యం.వెంకటరమణారెడ్డి ఈ షెడ్యూలు దాఖల ఆస్థిని ఇతరులకు పరాదీనములు చేయుటకు ప్రయత్నం చేయుచున్నారని తెలియవచ్చినది. సదరు పరాదీనములు చెల్లనేరవు మరియు నా క్లైంటును బద్ధగించవు మరియు నా క్లైంటు తీసుకొనబోవు చట్టపరమైన చర్యలకు బాధ్యులగుదురు.

**ఆస్థి షెడ్యూలు:** ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరుజిల్లా రిజిస్ట్రేషన్, నెల్లూరు సబ్‌రిజిస్ట్రేషన్, నెల్లూరు మున్సిపల్ పరిధిలోని పట్టా నెం. 545, సర్వేనెం. 656-2 ఆఫ్ నెల్లూరు బిట్ 1, ఏరియాలో 3ఎకరముల 35సెంట్లలో ఒక ఎకరా 12 సెంటులు(0.56+0.56)

ఇట్లు

**పెనుబాక గంగాధర్‌రెడ్డి, అడ్వకేట్**

**రమేష్‌రెడ్డి నగర్, నెల్లూరు. సెల్. 9849349333**

గల్పిక

# కైలాసంలోనూ క్రికెట్ ఫీవర్

అది కైలాస్ సిటీ. పరమశివుడి నివాసం. అప్పుడే సూర్యోదయమైంది. శివుడు నిద్రలేచాడు. కొద్దిసేపు యోగా చేసాడు. ఓ అరగంట వాకింగ్ కూడా చేసి, తర్వాత సి.డి ప్లేయర్ ఆన్ చేసాడు. చిరంజీవి, అర్జున్‌లు శివుడు, మంజునాథ పాత్రలలో నటించిన 'మంజునాథ' సినిమాలోని భక్తి గీతాలకు కొద్దిసేపు నృత్యం చేసాడు. ఆ తర్వాత రిలాక్సయ్యి తన మెడను చూసుకున్నాడు. 24-7 తరహాలో ఎప్పుడూ తన మెడలో వుండే నాగరాజు కనిపించలేదు. పార్వతీ... అంటూ శివుడు కేకేసాడు. ఏమైంది స్వామి అంటూ పార్వతీదేవి వచ్చింది. నాగరాజు ఏమయ్యాడని శివుడు ప్రశ్నించాడు. మీరు ఎర్లీమార్నింగ్ లేచి యోగా, వాకింగ్ చేస్తున్నారు కదా, మీతోపాటు నాగరాజు కూడా ఎర్లీగా లేవాల్సి వస్తుంది. అందుకని మీరు లేవకముందే అది మీ మెడను వదిలి ఆ బెడ్‌మీదే పడుకుని నిద్రపోతుంది అని పార్వతీదేవి చెప్పింది. తర్వాత శివుడు చకచకా స్నానం, టిఫిన్ చేశాడు. శివుడు అంత స్పీడ్‌గా ఎందుకు రెడీ అయ్యాడో పార్వతీదేవికి అర్థం కాలేదు. బహుశా, ముల్లోకాధిపతుల మధ్య శిఖరాగ్ర సమావేశం ఏదన్నా వుందో, లేదంటే దేవతల జనరల్ బాడీ మీటింగ్ ఏదన్నా వుందోనని అనుకుంది. కాని శివుడు మాత్రం 9గంటలకు టీవీ ముందు సెటిలయ్యాడు. రిమోట్ తీసుకుని స్టార్‌స్పోర్ట్స్ ఛానెల్ పెట్టాడు. స్క్రీన్ మీద చుక్కలు చుక్కలుగా రాసాగింది. దృశ్యాలు రావడం లేదు. శివుడుకి అరికాల్లో మండింది. దేవీ... టీవీ రావడం లేదేంటని అడిగాడు. ఏమోనండి... రాత్రి నేను ధమాల్ టీవీలో 'మొగుడిని అమ్మిన పెళ్లాం' సీరియల్ చూసి పడుకున్నాను, అప్పుడు టీవీ బాగానే వచ్చింది. మరి ఇప్పుడేమైందోనని అంది. ఈ డిష్ టీవీలతో వచ్చిన తలనొప్పే ఇది... టైంకు సిగ్నల్స్ పనిచేయవు. అవతల ఆల్‌రెడీ భారత్-పాక్ క్రికెట్ మ్యాచ్ మొదలైవుంటుంది. ఫస్ట్ బ్యాటింగ్ ఎవరిదో, ఎన్ని పరుగులు చేసారో, ఎన్ని వికెట్లు పడ్డాయో తెలీడం లేదు అని మనసులో అనుకుంటూ తన మనోనేత్రంతో అంతరిక్షంలో తిరుగుతున్న శాటిలైట్‌ను కంట్రోల్‌లో పెట్టి తన టీవీకి దానితో లింకప్‌కు తెచ్చాడు. దాంతో టీవీలో భారత్-పాక్‌ల వన్డే మ్యాచ్ కనిపించసాగింది. మొదట భారత్ బ్యాటింగ్... అప్పటికే రోహిత్‌శర్మ అవుటై వున్నాడు. విరాట్‌కొహ్లీ, శిఖర్ ధావన్‌లు కుమ్మేస్తున్నారు. కొద్దిసేపటికి ధావన్ అవుటయ్యాక సురేష్‌రైనా వచ్చాడు. స్కోర్ బోర్డును పరుగెత్తించసాగాడు. భారత క్రికెటర్లు ఫోర్లు, సిక్సర్‌లు కొట్టినప్పుడల్లా శివుడు చప్పట్లు కొడుతూ ఫోర్, సిక్సర్ అని హుషారుగా అరుస్తున్నాడు. ఇంట్లో పనులన్నీ ముగించుకుని పార్వతీదేవి కూడా వచ్చి శివుడు పక్కన కూర్చుని క్రికెట్ చూడసాగింది. శివుడు ఏదో గుర్తొచ్చినట్లు... దేవీ మన గణపతి, సుబ్రహ్మణ్యంలు ఎక్కడకు వెళ్లారు అని అడిగాడు. భూలోకంలో ప్రపంచ క్రికెట్‌కప్ పోటీలు జరుగుతున్నట్లు కైలాసంలో కూడా మన గణపతి, సుబ్రహ్మణ్యంలు క్రికెట్ మ్యాచ్‌లు పెట్టారు. వాళ్ల అనుచరులతో జట్లుగా ఏర్పడ్డారు. రేపు శివరాత్రి రోజు పోటీలు ప్రారంభమవుతాయి. మీ చేతుల మీదుగా పోటీలను ప్రారంభించాలని చెప్పారు. ఇప్పుడు క్రికెట్ నెట్ ప్రాక్టీసుకు వెళ్లారని చెప్పింది. మన బిడ్డలిద్దరూ క్రికెట్ క్రీడలో నైపుణ్యం సంపాదిస్తే వచ్చే ప్రపంచకప్‌లో భారత్ తరపున వాళ్లిద్దరినీ ఆడించడానికి ప్రయత్నిస్తానని శివుడు హామీ ఇచ్చాడు. స్వామీ... ఈ మ్యాచ్‌ను ఇంత ఇంట్రస్ట్‌గా చూస్తున్నారు, ఈ పోటీలో ఎవరు గెలుస్తారంటారు అని పార్వతీదేవి అడిగింది. ఇంకెవరు దేవి, ఖచ్చితంగా భారత్ గెలుస్తుందని శివయ్య చెప్పాడు. అంత ఖచ్చితంగా ఎలా చెప్పగలరని పార్వతీదేవి అడిగింది. అందుకు శివుడు... భారత్ ఆటగాళ్లు ఈ క్రీడలో గెలవాలనే పంతంతో ఆడతారు, కాని పాకిస్థాన్ ఆటగాళ్లు మాత్రం ఆటలో కంటే కూడా భారతదేశం మీద గెలవాలనే ఒత్తిడితో ఆడతారు. ఆట మీద చిత్తశుద్ధితో ఆడిన వాళ్లనే ఎప్పుడైనా విజయం వరిస్తుందని చెప్పాడు. ఎవరు గెలుస్తారో ముందుగానే తెలిసినప్పుడు ఈ మ్యాచ్ చూడడం అవసరమా అని పార్వతీదేవి అంది. లేదు దేవి... మ్యాచ్‌లో ప్రతి సీన్‌ను చూస్తేనే ఆనందించగలమని చెప్పి, సాయంత్రం దాకా మ్యాచ్ చూసారు. మ్యాచ్‌లో భారత్ గెలవగానే శివయ్య, పార్వతీదేవిలు సంబరాలు చేసుకున్నారు. అప్పుడే వినాయకుడు, సుబ్రహ్మణ్యస్వామిలు వచ్చారు. ప్రాక్టీస్ ఎలా చేస్తున్నారని వారిని శివయ్య అడిగాడు. కష్టపడి చేస్తున్నామని, ఇటీవల ఆస్ట్రేలియా నుండి కైలాసానికి వచ్చిన హ్యూస్(క్రికెట్‌బంతి తగిలి మృతి చెందిన ఆస్ట్రేలియా క్రికెటర్) తమకు మంచి శిక్షణ నిస్తున్నారని చెప్పారు. శివరాత్రి రోజు మొదలయ్యే పోటీలకు దేవలోకాధిపతులకు, దేవతలకు అందరికీ ఆహ్వానాలు పంపాలని కుమారులిద్దరూ కోరగా, ఆ పని నారదుల వారికి అప్పగిద్దామని శివుడు చెబుతాడు.

★★★★★

శివరాత్రి పర్వదినం... పరమేశ్ కైలాస్ స్టేడియం. విష్ణు, బ్రహ్మలతో పాటు ఇంద్రుడు, యముడు, ఇతర దేవతలందరూ వచ్చారు. స్టేడియం అంతా దేవతలు, శివుడి అభిమానులైన రాక్షసగణాలతో నిండిపోయింది. గణపతి టీమ్‌కు, సుబ్రహ్మణ్యం టీమ్‌కు విడివిడిగా డ్రెస్‌లు ఇచ్చారు. స్టేడియంలో ఇరు జట్ల అభిమానులు వారివారి జెండాలు చేతపట్టి కమాన్ గణపతి టీమ్, కమాన్ సుబ్రహ్మణ్యం టీమ్ అంటూ నినాదాలు చేస్తున్నారు. విష్ణుమూర్తి రిబ్బన్ కట్ చేయగా, ఇంద్రుడు టాస్ వేసాడు. శివుడు మొదటి బంతి వేయగా యముడు బంతిని బ్యాట్‌తో కాకుండా తన గదతో కొట్టాడు. అంతే ఆ బంతి ఆకాశంలో వున్న గ్రహాలన్నింటిని దాటుకుంటూ సూర్యుడిని తాకి మసైపోయింది. అంపైర్‌గా బ్రహ్మ వ్యవహరించారు. ఆయనైతే స్టేడియం నలువైపులా చూడగలడని, రీప్లేలతో అవసరం లేదని చెప్పి ఆయనకు ఆ బాధ్యత అప్పగించారు. ఇరుజట్ల మధ్య మ్యాచ్ మొదలైంది. ఈరోజు శివరాత్రి... కుమారుల మధ్య జరిగే మ్యాచ్ చూడాలనే ఆసక్తి వున్నా భూలోకంలో నా దర్శనానికి వచ్చే భక్తులను ఆశీర్వదించాల్సి వుందని చెప్పి శివపార్వతులు అందరి వద్ద సెలవు తీసుకుని స్పెషల్ ఫ్లైట్‌లో భూలోకానికి బయలుదేరారు. జర్నీలో ఉండగా పార్వతీదేవి... స్వామీ, ఇండియా-పాకిస్థాన్‌లలో ఎవరు గెలుస్తారో ముందుగానే చెప్పారు కదా, మరి మన ఇద్దరు బిడ్డలలో ఎవరు గెలుస్తారో చెప్పగలరా అని అడిగింది. గణపతి టీమ్ గెలుస్తుంది దేవి అని శివుడు చెప్పాడు. ఆ మాటకు పార్వతీదేవి ఆశ్చర్యపోయింది. అదేంటి స్వామి భారత్ ఆటగాళ్లు ఆట మీద చిత్తశుద్ధితో ఆడారు కాబట్టి గెలిచారు. పాక్ వాళ్లు భారత్ మీద ద్వేషంతో ఆడారు కాబట్టి ఓడారన్నారు బాగానే వుంది. మరి మన బిడ్డలిద్దరు కూడా ఆటమీద చిత్తశుద్ధితోనే ఆడుతున్నారు కదా, మరి గణపతి టీమ్ గెలుస్తుందని ఎలా చెప్పగలరు అని అడిగింది. గణపతికి వున్న అవకాశాలు సుబ్రహ్మణ్యంకు లేవని శివయ్య చెప్పాడు. ఏంటి ఆ ఎగ్స్ట్రా క్వాలిఫికేషన్స్ అని పార్వతీదేవి అడిగింది. గణపతి చేతులతో బ్యాటింగ్ చేస్తాడు. బంతి ఎక్కువ ఎత్తులో వచ్చి చేతులకు అందనప్పుడు తొండంతోనూ బంతిని బౌండరీకి పంపగలడు. అలాగే ఫీల్డింగ్ చేస్తుంటే ప్రత్యర్థి కొట్టిన బంతి గాల్లోకి ఎగిరినప్పుడు చేతులతో పట్టుకోగలడు, చేతులకు అందకుంటే తొండంతో క్యాచ్ పట్టి అవుట్ చేయగలడు. కాబట్టి గణపతి టీమ్‌కు గెలుపు అవకాశాలెక్కువని చెప్పానన్నాడు.

వీరు మాట్లాడుకుంటుండగానే ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ వచ్చింది. ఇద్దరూ దిగారు. ముందుగా 'ఆప్' కార్యాలయంలో శివరాత్రి ఏ విధంగా చేస్తున్నారో చూద్దామని వెళ్లారు. అక్కడ చూస్తే అరవింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియా, అలక్‌లాంబా వంటి నేతలు దిగాలుగా వున్నారు. హామీల జాబితాను ముందేసుకుని నిరాశగా చూస్తున్నారు. అరవింద్ కేజ్రీవాల్ మిగతా నేతలతో... ఢిల్లీ ప్రజలు మనపై అతిగా నమ్మకం పెట్టుకున్నారు. మనకు చూస్తే పరిమితి అధికారాలున్నాయి. మనమిచ్చిన హామీలను ఎలా తీర్చాలో అర్థం కావడం లేదన్నాడు. మిగతా నేతలు కూడా ఏం చెప్పాలో తెలియక తలలు పట్టుకు కూర్చున్నారు. వీళ్లకు అసలు ఈరోజు శివరాత్రి అనే సంగతే తెలిసినట్లు లేదని శివపార్వతులు అక్కడనుండి బీజేపీ కార్యాలయానికి వెళ్లారు. అక్కడ పురుగులేదు. ఓటమి నిరాశ ఆ పార్టీ ఆఫీసు ముఖాన కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. అక్కడ కూడా శివరాత్రి వాతావరణం లేకపోవడంతో అక్కడ నుండి టెన్‌జనపథ్‌కు వెళ్లారు. అక్కడ పండుగ వాతావరణం కంటే శ్మశాన వైరాగ్యం ఎక్కువుగా వుంది. ఢిల్లీలో డిపాజిట్లు కూడా రాకపోవడంతో రాహుల్, దిగ్విజయ్‌సింగ్, అహ్మద్‌పటేల్, అజయ్ మాకెన్ వంటి నేతలు నెత్తిన కాంగ్రెస్ జెండాలు వేసుకుని దిగాలుగా ముఖంపెట్టి కూర్చుని వున్నారు. దేశంలోని దరిద్రమంతా వాళ్ల ముఖాల్లోనే కనిపించసాగింది. ఎక్కువసేపు వారి దీనస్థితిని చూడలేక శివపార్వతులు హైదరాబాద్‌కు వచ్చారు. మొదట కేసీఆర్ ఇంటికి వెళ్లారు. సాంబ్రాణీ కడ్డీల పొగతో ఆ ఇంట్లో పండుగవాతావరణం కనిపిస్తుంది. కేసీఆర్ భయకరంగా మంత్రాలు చదువుతున్నాడు. నిజమైన భక్తుడంటే కేసీఆర్ అనుకుంటూ శివుడు ఆయన పూజ చేస్తున్న గదివైపు చూసాడు. అంతే షాక్ తిన్నాడు. అక్కడ తన ఫోటో బదులు నిజాం నవాబు ఫోటో వుంది. కేసీఆర్ అతని చిత్రపటానికే పూజ చేస్తున్నాడు. అప్పుడే అక్కడకు వచ్చిన ఈటెల రాజేందర్‌ను ఆపి... శివరాత్రి రోజు శివుడికి కాకుండా ఆ ఫోటోకు పూజచేస్తున్నాడేంటని శివయ్య అడిగాడు. దానికి ఈటెల... ఆయనకు శివుడైనా, యముడైనా అన్నీ నిజాం నవాబే... శివరాత్రి, కాళరాత్రి అని లేదు, ప్రతిరోజూ మా కేసీఆర్ ఆయనకు పూజ చేస్తుంటాడు అని చెప్పాడు. ఈ దుర్మార్గాన్ని మేము చూడలేమంటూ శివపార్వతులు అక్కడనుండి మాయమై చంద్రబాబు ఇంట్లో ప్రత్యక్షమయ్యారు. అక్కడ పండుగ వాతావరణం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. చంద్రబాబు కూడా మంత్రాలు చదువుతున్నాడు. నిజమైన భక్తుడంటే బాబే అని శివయ్య మనసులో అనుకున్నాడు. చంద్రబాబు ఏ స్థాయిలో పూజ చేస్తున్నాడో చూద్దామని పూజా మందిరం వద్దకు వెళ్లాడు. అంతే వెయ్యిఓల్ట్‌ల కరెంట్‌తీగ పట్టుకున్నట్లుగా శివయ్యకు షాక్... అక్కడి పూజామందిరంలో తన ఫోటో కాదు కదా ఏ దేవుళ్ల ఫోటోలు కూడా లేవు. కాని ఒకే ఒక్క చిత్రపటం వుంది. అదే సింగపూర్ సిటీ ఫోటో. చంద్రబాబు దానికే పూజ చేస్తున్నాడు. అటుగా వచ్చిన ఆయన సతీమణి భువనేశ్వరీదేవిని పట్టుకుని పార్వతీదేవి... శివరాత్రి రోజు శివపార్వతులకు పూజ చేయకుండా ఆ భవంతుల ఫోటోకు పూజ చేస్తున్నారేంటని పార్వతీదేవి అడిగింది. అందుకు భువనేశ్వరీదేవి... సీఎం అయినప్పటి నుండి మా శ్రీవారు అందరు దేవుళ్లను మరిచిపోయారు. అన్ని పండుగలను మరచిపోయారు. కేవలం ఆయన మనసులో, మెదడులో సింగపూర్ పిక్చర్ మాత్రమే వుంది. సింగపూరే ఆయనకు దైవమైనా, ప్రజలకు దెయ్యమైనా అని అంది. శివరాత్రి రోజు భూలోకంలో చూసిన ఈ సన్నివేశాలతో శివపార్వతుల మనసు బాధపడింది.

భూలోకంలో వుండి ఈ దుర్మార్గాలను చూడడం కంటే కైలాసానికి వెళ్లి గణపతి-సుబ్రహ్మణ్యంల మ్యాచ్‌ను చూడడమే మేలనుకుని అప్పుడే తిరుగు ముఖం పట్టారు.

కదంబం

## కీర్తి కాయం

అడిగోపుల వెంకటరత్నమ్
తిరుపతి. 9848252946

మరణం నడకలోను వుంది
పడకలోను వుంది
మాటలోను వుంది
విశాల విశ్వంలో లోకాలు రెండే
శ్రామిక లోకం
విశ్రాంత లోకం!
మోయలేని బరువులు మోపెడైనపుడు
దాటలేని రుగ్మతలు వెల్లువైనపుడు
కాళ్ళు రెండూ కాలాన్ని యీదలేనపుడు
మోసి మోసి మంచం విరక్తిపాలైనపుడు
మరణం నేస్తమై
మౌనానికి దారులు వేస్తుంది
స్వాగతిస్తే రావటానికి
వెళ్ళమంటే వీడ్కోలివ్వటానికి
మరణం మరబొమ్మ కాదు
మరణానిది స్వయం ప్రతిపత్తి!
అంగారక గ్రహంలో అడుగిడినవాడు
చంద్రమండలంలో మట్టి తవ్వినవాడు
సప్తసముద్రాలు యీదినవాడు
మరణ మృదంగం విన్నవాళ్ళే!
మనిషి యశశ్శేషమయ్యాక
కీర్తి మహాశేషమై
నింగి నేల ఏలుతుంది
నెత్తావి చల్లుతుంది
ఎప్పుడో వొకప్పుడు
మరణం మనిషికి పరీక్షపెడుతుంది
అందులో పాసైన దాఖలాలు లేవు!
వెయ్యేళ్ళ నన్నయ భట్టారకుడు
నేటికీ ఇంటింటా
సంభావన అందుకుంటున్నాడు
మహాత్ముడు దేశానికి తండ్రై
కన్నబిడ్డల్ని లాలిస్తున్నాడు
ఐన్‌స్టీన్ సూత్రబద్ధంగా
విద్యాలయాల్ని చుట్టుతున్నాడు
ఎప్పుడైనా ఎక్కడైనా
మరణం ఒక మజిలీ
కీర్తిది గమ్యస్థానం!

## 22న 'ఆనాటి నెల్లూరోళ్ళు' పుస్తకావిష్కరణ

ప్రముఖ కవి, రచయిత ఈతకోట సుబ్బారావు రచించిన 'ఆనాటి నెల్లూరోళ్ళు' చరిత్ర పుస్తకాన్ని ఈ నెల 22వ తేదీ సాయంత్రం 6-05 గంటలకు నెల్లూరులోని టివిఎస్ కళ్యాణసదన్‌లో ఆవిష్కరించనున్నారు. స్థానిక సాహితీమండలి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు వితపు బాలసుబ్రహ్మణ్యం, లాయర్ వారపత్రిక సంపాదకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి, తిప్పరాజువారిసత్రం ఫౌండర్ ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్, తెలుగు భాషోద్యమ నాయకులు చలంచర్ల భాస్కరరెడ్డి, ప్రముఖ కవి చిన్ని నారాయణరావు, డిప్యూటి డిఎంహెచ్‌ఓ డాక్టర్ ఈదూరు సుధాకర్ తదితరులు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. సాహిత్యాభిమానులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయవలసిందిగా వారు విజ్ఞప్తి చేశారు.



పల్లిపాడులోని శ్రీ మీనాక్షీ సమేత
శ్రీ రామేశ్వర వేణుగోపాలస్వామి దేవస్థానంలో

# ఆధ్యాత్మిక వేడుక

## కన్నుల పండుగగా రాజగోపుర మహాకుంభాభిషేకం

ఇందుకూరు పేట మండలం, పల్లిపాడు గ్రామం లోని శ్రీ మీనాక్షీ సమేత శ్రీ రామేశ్వర వేణుగోపాలస్వామివార్ల దేవస్థానంలో ఈ నెల 13 నుంచి 17వ తేది వరకు రాజగోపుర మహాకుంభాభిషేకం, వీరభద్ర అయ్యప్ప స్వామివార్ల విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు కన్నుల పండువగా జరిగాయి. ఎంతో కాలంగా పల్లిపాడు గ్రామంలో భక్తులకు కొంగుబంగారమై వెలసివున్న ఈ ఆలయంలో నిత్యపూజలందుకుంటున్న శ్రీ మీనాక్షీ సమేత శ్రీ రామేశ్వరస్వామి, రుక్మిణీ సత్యభామా సమేత శ్రీ వేణుగోపాలస్వామివార్ల దేవాలయాన్ని జీర్ణోద్ధరణ చేసి పున:ప్రతిష్ట చేశారు. నూతనంగా ఈ దేవాలయంలో రాజగోపుర నిర్మాణం జరిగిన సందర్భాన్ని పురస్కరించుకుని మహాకుంభాభిషేకం, మరియు శ్రీచక్ర ప్రతిష్ఠతో పాటు వీరభద్రస్వామి, అయ్యప్పస్వామివార్ల నూతన విగ్రహాలను ప్రతిష్ఠించి, మహా కుంభాభిషేకాలు నిర్వహించారు. త్రయాహ్నిక దీక్షతో ఎంతో వైభవంగా జరిగిన ఈ కార్యక్రమాల్లో గ్రామ ప్రజలు, ప్రముఖులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా, 13వ తేది ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాద వితరణ గావించారు. అదే రోజున సాయంత్రం శాలా సంస్కారం, గణపతి పూజ, కలశస్థాపన, జలాధివాసం కార్యక్రమాలను శాస్త్రబద్ధంగా నిర్వహించారు. 14వ తేదీ కూడా ఇదేవిధంగా స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 15 వ తేది ఉదయం రాజగోపురం, వీరభద్ర, అయ్యప్పస్వామి వార్ల విగ్రహాలతో పాటు శ్రీ చక్ర ప్రతిష్ఠ జరిపి నూతన యాగశాలను ప్రారంభించడమే కాకుండా స్వామివార్లిరువురికీ ప్రత్యేక శాంతి కల్యాణాన్ని నిర్వహించి మహాదాశీర్వచనాలు చేయడంతో పాటు దాదాపు 5వేల మందికిపైగా అన్నసంతర్పణ చేశారు. ఇదేరోజు రాత్రి స్వామివార్లకు పల్లకీ సేవ వైభవంగా నిర్వహించారు. 16వతేది ఉదయం నుంచి ఘనంగా మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించి, రాత్రి శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామివార్లకు సహస్ర నామార్చన నిర్వహించారు. 17న మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉదయం నుంచి స్వామివార్లకు కన్నుల పండువగా కల్యాణోత్సవం నిర్వహించారు. రాత్రి 11 నుంచి 12.30 గంటల లోగా లింగోద్భవ కాల అభిషేకం నిర్వహించి, రాత్రి 12.30 గంటల నుంచి ఎంతో వేడుకగా గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవం సందర్భంగా గ్రామదేవత గంగమ్మ ఉత్సవానికి ముందు ఊరేగుతూ ఉండగా వురదాళ్ళు వేస్తూ బాణాసంచా పేలుస్తూ ప్రభల వెలుగులో కీలుగుర్రాలు, తప్పెట్లు, తాళాలు, తీన్‌మార్ డ్రమ్ముల నడుమ దేదీప్యమానమైన విద్యుత్ అలంకరణతో స్వామివారి గ్రామోత్సవం కొనసాగింది. ఆస్ట్రేలియా నుండి తెప్పించిన ప్రత్యేక పూలతో కుంతూరు సుమన్ చేసిన పుష్పాలంకరణ ఈ ఉత్సవాల్లో హైలెట్‌గా నిలిచింది. 17వ తేదీ రాత్రి ప్రారంభమైన గ్రామోత్సవం 18వతేదీ ఉదయం 11గంటలకు ముగియగా, అదేరోజు సాయంత్రం జరిగిన వసంతోత్సవంతో ఈ వేడుకలకు మంగళం పలికారు.



ఆలయ ప్రధానాచార్యులు, వైదికరత్న బ్రహ్మశ్రీ మాచవోలు రాజశేఖర శాస్త్రి నేతృత్వంలో ఈ కార్యక్రమాలన్నీ ఆద్యంతం ఎంతో భక్తిశ్రద్ధలతో, సంప్రదాయ బద్ధంగా జరిగాయి. నూతనంగా నిర్మించిన రాజగోపురాన్ని దువ్వూరు శివకుమార్‌రెడ్డి, వారి సతీమణి మమతారాణి, కుమారుడు దువ్వూరు సిద్ధార్థరెడ్డిలు తమ దాతృత్వంతో నిర్మింపజేయగా, శ్రీ వీరభద్ర స్వామి, అయ్యప్పస్వామివార్ల విగ్రహాలతో పాటు, యాగశాల, శ్రీచక్ర ప్రతిష్ఠలను గ్రామ ప్రజలు, భక్తులందరి సహాయ సహకారాలతో నిర్మింపజేసుకున్నారు. అయిదు రోజులపాటు జరిగిన ఈ మహోత్సవాలను గ్రామప్రజలందరూ తమ ఇంటి పండుగలా ఎంతో ఘనంగా నిర్వహించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీమతి యు.జానకి పర్యవేక్షణలో, ఈ అయిదు రోజుల వేడుకలతో పాటు చివరిరోజు జరిగిన గ్రామోత్సవం భక్తులందరినీ విశేషంగా ఆకట్టుకుంది.

తమ సొంత పనులను సైతం మానుకుని ఆలయ నిర్మాణ పనులను పర్యవేక్షించిన గ్రామపెద్దలకు, గ్రామప్రజల సుఖసంతోషాల కోసం నిత్యం పూజలు నిర్వహిస్తూ ఈ ఆలయ నిర్వహణలో భాగస్వామ్యం వహిస్తున్న ఆలయ నిర్వాహకులకు 'లాయర్' అభినందనలు.





Appear for the best medical entrances with confidence



Mr. K.V.Ratnam
"Seelena Sobhathe Vidya"

Join Ratnam's MEDISURE
For sure-shot success in medical entrances



This is a 2-year intensive coaching programme that puts the medical aspirants through rigorous training, scientific teaching and nurturing skill-sets to come out successful in all medical entrance examinations. This coaching technique comes from the pioneers in this realm, who've been coaching the aspiring doctors for over 35 years. Its erstwhile students are all established as specialist doctors today.

Specialised faculty | Scientific teaching techniques | MPC, JEE - Advanced, Mains & EAMCET | Bi.P.C., Medical coaching

Pioneer in EAMCET
Master in Medical

An exclusive training institute for all medical entrance examinations

For special enquiries, contact the Chairman: 9849600500

RATNAM JUNIOR COLLEGE
NELLORE, ANDHRA PRADESH

For more details, please contact: 9959600400, 7842880888, 9440658301


Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com